J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

"For the people,
for the truth, for justice -
this is the spirit of journalism"

# లాయర్

సంపుటి : 46 సంచిక : 2 12.6.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



Late. **Tunga RajaGopalaReddy** Garu
Founder, Lawyer Patrika

Forty Five years of
**INTEGRITY - IMPACT - TRUST**

Congratulations to **LAWYER PATRIKA**
on this remarkable milestone.
May your legacy continue
to inspire generations to come.



**Dr. PREMSAGAR REDDY**
U.S.A

# బాలయ్య పుట్టినరోజు వేడుకలు



బాలకృష్ణ బర్త్‌డే కేక్‌ని కట్ చేస్తున్న నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పక్కన అబ్దుల్ అజీజ్

ప్రముఖ సినీ హీరో.. యువరత్న నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు నెల్లూరులోఈనెల 10న ఉత్సాహంగా జరిగాయి. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో పలువురు నాయకులు, బాలకృష్ణ అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శీనయ్య మాట్లాడుతూ, బాలకృష్ణ అభిమానాన్ని పొందగలగడం తన అదృష్టమన్నారు. తాను ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నానంటే అది బాలకృష్ణ వల్లేనన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే.. మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు. తొలుత, నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలయ్యకి శుభాకాంక్షలు చెప్తూ, భారీ కేకును కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు.

# ఆదర్శ నారి..పొణకా కనకమ్మ



పొణకా కనకమ్మకి నివాళులర్పిస్తున్న సామాజిక సమరసత వేదిక సభ్యులు

ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధురాలు..సమాజ సంస్కర్త..వీర నారి పొణకా కనకమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. పొణకా కనకమ్మ 135వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 10న నెల్లూరు పురమందిరంలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అఖిల భారతీయ సంయోజక్ సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొని ఆమెకి నివాళులర్పించారు. జమీందారీ కుటుంబంలో పుట్టిన పొణకా కనకమ్మ దేశభక్తితో స్వాతంత్య్ర సమరంలో పాల్గొని, జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్రలోనే తనదంటూ ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించుకున్నారన్నారు. నెల్లూరులో కస్తూరిదేవి విద్యాలయం స్థాపించి ఎందరో బాలికలకు విద్యాబుద్ధులు చెప్పించారని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుపతిలోని ఆయుర్వేద వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుదీక్షిత్, విశ్రాంత ఐఏఎస్ అధికారి పరశురాం, సామాజిక సమరసత వేదిక రాష్ట్ర మహిళా కన్వీనర్ కె.జయప్రద, డాక్టర్ కె.వెన్నెల, జి.లక్ష్మి, కె.సుభాషిణి, పోలయ్య కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కనీస వేతనచట్టం అమలుచేయాలి



ధర్నా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతన చట్టం అమలుచేయాలని, ఆ చట్టం ప్రకారం ప్రతి కార్మికుడికి నెలకు కనీసం 26వేల రూపాయలు వేతనంగా ఇవ్వాలని యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎన్.సతీష్‌కుమార్, సందానిబాషా డిమాండ్ చేశారు. ఈనెల 9న నెల్లూరులో సర్వజన ఆసుపత్రి వద్ద వారు ధర్నా నిర్వహించారు. కార్మికులకు ప్రతినెలా 1వతేదీన జీతాలివ్వాలని, పెండింగ్‌లో ఉన్న పిఎఫ్, ఇఎస్ఐ మొత్తాలను చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆందోళనలో నాయకులు విజయ్, యశ్వంత్ తదితరులతో పాటు మహిళా నాయకులు పాల్గొన్నారు.

# గీత కార్మికులకు ప్రమాదబీమా ఇవ్వండి

గీత కార్మికులకు ప్రమాదబీమా అమలు చేయాలని జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శీనయ్యగౌడ్ కోరారు. ఈనెల 7న నెల్లూరు రూరల్‌లోని కాకుపల్లి గ్రామంలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గీత వృత్తిదారుల సాధికారతకు ప్రభుత్వాలు కృషిచేయాలన్నారు. కొబ్బరి, తాటి, ఈత చెట్ల కోసం ఫామ్‌బోర్డు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా తాటిచెట్లను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు దయాకర్, చక్రపాణి, రాజారావు, భాస్కర్, రమేష్, రాధాకృష్ణ, శ్రీనివాసులు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### మార్కుల జాబితాల్లో..
# తప్పులుంటే సరిదిద్దుకోండి

ఇటీవల పదవ తరగతి విద్యార్థులకు విడుదలైన షార్ట్ మెమోలో ఏమైనా తప్పులుంటే సరిదిద్దుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీరావు ఈనెల 10న ఒక ప్రకటనలో సూచించారు. విద్యార్థుల పేర్లు, ఇంటిపేర్లు, తల్లితండ్రుల పేర్లు వగైరాలతో పాటు మరేదైనా పొరపాట్లు ఉంటే, ఆయా పాఠశాలల లాగిన్ నుంచి ఈనెల 15వ తేదీలోగా వాటిని సరిదిద్దుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని ఆయన తెలిపారు.

### కలెక్టరేట్ వద్ద
# వడ్డెరల ధర్నా

రాష్ట్రంలో వడ్డెర వృత్తిదారులపై దాడులు పెరిగిపోతున్నాయని, ప్రభుత్వం పట్టించుకుని తమను ఆదుకోవాలని రాష్ట్ర వడ్డెర వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి గుంజి దయాకర్ కోరారు. తమ వృత్తిదారుల సమస్యలు తీర్చాలంటూ ఈనెల 8న ఆ సంఘం ఆధ్వర్యంలో నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెరలపై పెత్తందారుల దౌష్ట్యాలను అరికట్టాలని, ప్రభుత్వం వెంటనే సామాజిక రక్షణ చట్టం అమలుచేసి తమకు న్యాయం చేయాలని కోరారు. సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, రామ్‌ప్రసాద్, వెంకయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

### బీహార్ బస్సు ప్రమాదంలో..
# నాలుగుకు చేరిన మృతులు

బీహార్‌లో ఇటీవల జరిగిన బస్సు ప్రమాదంలో నెల్లూరుజిల్లాకి చెందిన నలుగురు మృత్యువు పాలయ్యారు. కాశీ యాత్రకు వెళ్ళిన వీరు.. మార్గమధ్యంలో జరిగిన ప్రమాదంలో చనిపోయారు. ఇప్పటికే నెల్లూరుజిల్లా సంగం, ఆత్మకూరుకు చెందిన హజరత్తయ్య, (సంగం), సోమా పద్మావతి(ఆత్మకూరు)లతో పాటు నెల్లూరుకు చెందిన పి.వెంకటేశ్వర్లు మృతి చెందగా, తాజాగా అక్కడి ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న బొమ్మిశెట్టి లక్ష్మమ్మ మరణించారన్న సమాచారంతో సంగంలో విషాదఛాయలు అలముకున్నాయి.

### మూలస్థానేశ్వరాలయంలో..
# 12న ప్రదోష కాల పూజలు

నెల్లూరు మూలాపేటలో ఉన్న మూలస్థానేశ్వరాలయంలో ఈనెల 12న త్రయోదశి ప్రదోష కాల పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు నందీశ్వరునికి, మూలస్థానేశ్వరునికి ప్రదోష కాల అభిషేకాలు, రాత్రి 7 గంటలకు ప్రాకారోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఇఓ. ఏ.శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

### రాజరాజేశ్వరిదేవి ఆలయంలో..యోగా

యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 10న యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈషా ఫౌండేషన్ శిక్షకుల ద్వారా దేవస్థానం సిబ్బందికి, అర్చకులకు యోగాసనాలు నేర్పారు. ఆలయ ఛైర్‌పర్సన్ శిరీషా, ఇఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

### సోమిరెడ్డి చొరవతో..
# కార్మికుల సమస్యలకు పరిష్కారం

మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవతో ఎట్టకేలకు ఎస్ఇఐఎల్ కంపెనీలోని కార్మికుల సమస్యలకు పరిష్కారం లభించింది. తమ సమస్యలు తీర్చాలంటూ కార్మికులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో, సోమిరెడ్డి ముందుకు వచ్చి ఆ కంపెనీ ప్రతినిధులతో నాలుగురోజుల పాటు చర్చించి సమస్యలను పరిష్కరించారు. వివిధ అలవెన్సుల రూపంలో కార్మికులకు నెలకు రూ.4వేలకుపైగా ప్రయోజనం కల్పించేలా ఆ కంపెనీ యాజమాన్యాన్ని ఒప్పించారు. అదేవిధంగా, అటెండెన్స్ అలవెన్స్‌గా రోజుకి రూ.50 అదనంగా చెల్లింపు, హార్డ్‌షిప్ అలవెన్స్‌గా నెలకు రూ.500, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌గా రూ.500 నేరుగా కార్మికులకు చెల్లించేలా యాజమాన్యాన్ని ఒప్పించడం, ప్రతి కార్మికుడికి నెల జీతంతో పాటు బోనస్ రూ.1052, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ప్రయోజనం రూ.972 కలిపి చెల్లించేలా అంగీకరింపజేయడంతో సోమిరెడ్డికి కార్మికులు ధన్యవాదాలు తెలిపారు.

# అగ్నికుల క్షత్రియ విద్యార్థులకు.. ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలందుకున్న అగ్నికుల క్షత్రియ విద్యార్థినీ విద్యార్థులు

ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన 60 మంది అగ్నికుల క్షత్రియ విద్యార్థులకు ఈనెల 7న జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘం వారు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. నెల్లూరు మూలాపేటలోని శ్రీ వీరశైవ కల్యాణమండపంలో జరిగిన సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాము, డీఎస్పీ సీహెచ్ వెంకటశేషయ్య, తదితరులు మాట్లాడుతూ, విద్యతోనే సమాజంలో మంచి గౌరవం లభిస్తుందని, విద్యార్థులంతా కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో డాక్టర్ విఠల్‌మోహన్, ధర్మరాజస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మెన్ వేలూరు పెంచలరాజా, డాక్టర్ కంచి సుభాషిణి, హరిప్రియ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేతన్నల కష్టాలు తీర్చండి

**• రాష్ట్ర నాయకుల వినతి**

చేనేతకారుల న్యాయమైన సమస్యలు పరిష్కరించి వారి కష్టాలు తీర్చాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని చేనేతకారుల రాష్ట్ర సంఘం నాయకుడు.. రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ బండారు ఆనంద్‌ప్రసాద్ కోరారు. ఈనెల 7న స్థానిక నెల్లూరు ఆసుపత్రిలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వాలు చేనేతకారుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 50 ఏళ్ళు నిండిన చేనేతకారులకు పింఛను ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చేనేతకారులకు నేతన్న నేస్తం పథకం అమలుచేయాలని, కేంద్రప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీని రద్దుచేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 22న నెల్లూరు కలెక్టరేట్ వద్ద శాంతియుతంగా ధర్నా చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు బాలకృష్ణ, పూర్ణచంద్రరావు, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, పముజుల శంకరయ్య, హరి, బూదాటి రాధయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వేణుగోపాల్‌నగర్‌లో కార్డన్ సెర్చ్



నెల్లూరులోని వేణుగోపాల్‌నగర్‌లో ఈనెల 10వ తేదీన నవాబుపేట ఇన్స్‌పెక్టర్ జి.వేణుగోపాలరెడ్డి తన సిబ్బందితో కలిసి కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఇల్లిల్లూ తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 11 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని, అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాలు, గంజాయి విక్రయాల వంటి సమాచారం తెలిస్తే, ప్రజలు వెంటనే తమకు తెలియజేయాలని సిఐ కోరారు.

# స్టీల్‌ప్లాంట్ మృతులకు.. కోటి పరిహారం ఇవ్వాలి

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు కోటి రూపాయల వంతున పరిహారం చెల్లించాలని ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి యామాల మధు డిమాండ్ చేశారు. ఈనెల 9న నెల్లూరులోని ఏఐటీయుసి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్మికులు మృతిచెందడానికి కారణమైన వారిపై కేసు నమోదు చేయాలన్నారు. ఏఐటియుసి, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు ముక్తియార్, లీలామోహన్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16





THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 46 సంచిక : 2 12.6.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# కూటమికి రెండేళ్ళు.. క్యాడర్‌కి కన్నీళ్ళు!

- కష్టం కార్యకర్తలది - పదవులు కార్పొరేటోళ్ళకి
- సీనియర్లకి సీన్ లేదు - జూనియర్లకి గుర్తింపు లేదు
- నాయకుల్లో నిట్టూర్పు - కార్యకర్తల్లో కలవరం



అమరావతిలో క్వాంటం వ్యాలీలు, ఐకానిక్ టవర్లు, విశాఖలో గూగుల్ డేటా సెంటర్లు, తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ పెట్టుబడులు, భారీగా సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ హామీలు... అంటూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై డప్పులు కొడుతోంది. మాకు మరో 15 ఏళ్లు తిరుగులేదంటూ జబ్బలు చరుస్తోంది. మా పాలన అభివృద్ధికి చిరునామా, మా లక్ష్యం స్వర్ణాంధ్ర సాకారం అంటూ డబుల్ ధమాకా సభకి సిద్ధమవుతోంది. కానీ, సరిగ్గా ఇదే సమయంలో మా పార్టీ అధికారంలో ఉన్నా, మాకు కనీస విలువలేదు. మేం అనుకున్న పనులేవీ జరగడం లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే పేరు గొప్ప, ఊరు దిబ్బ అనేలా మా పరిస్థితి దిగజారిందంటూ సగటు తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు వాపోతున్నారు. చివరికి మొన్నమొన్న వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చి చేరిన వారికి లభించే గౌరవం కూడా మాకు దక్కడం లేదంటూ నిట్టూరుస్తున్నారు.

ఆవేదనకు రెండేళ్లు, అసంతృప్తికి రెండేళ్లు, అంటూ తమలో నివురుగప్పిన నిప్పులా దాగున్న బాధను పంటికింద భరిస్తూ, లేని ఆనందాన్ని ముఖంలో నింపుకుంటూ ప్రజల్లోకి వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు.

15లో



లాయర్
జూన్ 12, 2026

# చిన్నారుల్లో తగ్గిపోతున్న 'పఠనాసక్తి'

సెల్‌ఫోన్ల మాయాజాలం కావచ్చు, టీవీలు ఇతర ప్రసార మాధ్యమాల ప్రభావం కావచ్చు, పాశ్చాత్య వ్యామోహం కావచ్చు.. కారణమేదైతేనేం నేటి బాలల్లోకంలో పుస్తక పఠనాసక్తి బాగా సన్నగిల్లిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. పాతకాలంలో తల్లితండ్రులు, లేదా అయ్యవార్లు, ముఖ్యంగా ఇళ్లలో ఉండే అవ్వాతాతలు చిన్నపిల్లలకి బాగా దగ్గరగా ఉంటూ వాళ్లకి చిన్నచిన్న మాటలతో మంచి మంచి కథలు చెప్పేవారు. ఎంతో ఓపికగా పుస్తకాలను చదివించేవారు. నేటి ఆధునిక కాలంలో అంత ఓపిక-తీరిక ఎవరికీ ఉండడం లేదు. ఎవరి పనులు వాళ్ళవి. చిన్నపిల్లలు అల్లరి చేయకుండా ఉండడానికి చేతిలో సెల్‌ఫోన్ పెట్టేయడం అందరికీ అలవాటై పోయింది. దాంతో వాళ్లు అదే లోకంగా తయారైపోతున్నారు. ఒకటి నుంచి ఆరు తరగతుల విద్యార్థులు కూడా పాఠ్య పుస్తకాలు కానీ, కథలు ఇతరత్రా పుస్తకాలు కానీ చదవడానికి బద్దకిస్తున్నారు. అసలు వాటిమీద వాళ్లకి ఎలాంటి శ్రద్ధ ఉండడం లేదు. బడికి వెళ్లే పిల్లల్లో అధికశాతం మందికి చదవడానికి, రాయడానికి చేతకావడం లేదని, సెల్‌ఫోన్ల మీద ఉన్న శ్రద్ధ పుస్తకాల మీద ఉండడం లేదని నిపుణులు వాపోతున్నారు. ఇష్టమైన పుస్తకాలను చదువుకోవడం, మిత్రులకు మంచి పుస్తకాలు బహుకరించడం వంటివి నేటికాలంలో పూర్తిగా తగ్గిపోతున్నాయి. పూర్వకాలంలో అసలు చదువుకునేందుకు కూడా చాలామందికి సదుపాయాలు ఉండేవి కావు. పేదరికం, పెద్దలకు అక్షరజ్ఞానం లేకపోవడం, సామాజిక బలహీనతలు సమాజాన్ని బలహీనపరుస్తుండేవి. ఇప్పుడా కాలం పోయింది. చదువుకోవాలని అనుకోవాలే కానీ, ఎన్నెన్నో సౌకర్యాలు, గ్రంథాలయాలు లెక్కకు మించి ఉన్నాయి. నీతి పద్యాలు, బొమ్మలతో ఉండే కథల పుస్తకాలు, విజ్ఞానదాయకమైన పుస్తకాలు వంటివి వేల సంఖ్యలోనే గ్రంథాలయాల్లో మూలుగుతున్నాయి. కానీ చదివేవారెవరు?.. పుస్తకాలు చదివితే మంచి జ్ఞానం వస్తుంది. లోకజ్ఞానం తెలుస్తుంది. చదవడం ద్వారా పదాలు, మాటలు బాగా పలకడం అలవడుతుంది. అందుకే, పుస్తకం ఒక మంచి మిత్రుడు లాంటిదని పెద్దల మాట. గ్రంథాలయాలంటే ప్రపంచానికి పఠన ద్వారాలను తెరిచిన సరస్వతీ నిలయాలు. సమాజాభ్యుదయం కోసం పఠన సంస్కృతిని పెంచడానికి మన పూర్వీకులు ఎన్నో ఉద్యమాలు చేసి, ఎన్నెన్నో వ్యయప్రయాసలకోర్చి మరీ వాటిని ఒక వారసత్వంగా మనకు సమకూర్చారు. కానీ, అక్కడికి వెళ్ళి వాటిని చదువుకునేవారి సంఖ్య నానాటికీ తగ్గిపోతుండడమే బాధాకరం. అనేక గ్రంథాలయాల్లో అమూల్యమైన పుస్తకాలు చెదలు పట్టిపోతున్నాయి. గ్రంథాలయాల నిర్వాహకులు పాఠకుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎవరో కొంతమంది మాత్రం అటు వెళ్తున్నారే తప్ప, అధిక శాతం మందికి వాళ్ల ఊళ్లో గ్రంథాలయాలు ఎక్కడుండేది కూడా తెలియదంటే అతిశయోక్తి కాదు. పాతకాలంలో అద్దెకి పుస్తకాలు తెచ్చుకుని ఎంతో ఇష్టంగా చదువుకునేవారు. పుస్తకం చదవకుంటే ఆరోజు జరిగినట్లు కాదు. 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో..ఓ మంచి పుస్తకం కొనుక్కో' అని విజ్ఞులు చెప్పేవారు. ఈ కాలంలో ఇవన్నీ మనకోసం కాదులే అన్నట్లుంటున్నారు చాలామంది. మనసులోని భావాలను బయటకు చెప్పుకోవాలంటే.. అందుకు మంచి భాష ఉండాలి. ఆ భాషను నేర్చుకోవడానికి బాగా తోడ్పడేది పఠనమే. అక్షరాస్యత సాధించాలన్నా, మాతృభాషను పరిరక్షించుకోవాలన్నా ముందుగా పుస్తక పఠనాసక్తి ఎంతో ముఖ్యం. మన భాష మనం నేర్చుకోవాలి, మన భాషను మనం చదువుకోవాలి.. మాట్లాడుకోవాలి. తద్వారా భాషని బతికించుకోవాలి.

అందుకే చిన్నతనం నుంచి పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు 'జాతీయ పఠన దినోత్సవం'ను మనం ఏటా జరుపుకుంటున్నాం. కేరళలో అక్షరాస్యతకు ప్రాణం పోసి, గ్రంథాలయోద్యమానికి బాటలు వేసిన నారాయణ్ పనికర్ మరణించిన రోజైన జూన్ 19ని భారత ప్రభుత్వం ఆయన జ్ఞాపకార్థం 1996లో 'జాతీయ పఠన దినోత్సవంగా ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ 2017లో 'జాతీయ పఠన మాసాన్ని' (నేషనల్ రీడింగ్)కు కూడా శ్రీకారం చుట్టారు. ఈ పఠన మాసం జాతీయ పఠన దినోత్సవంతో ప్రారంభమవుతుంది. అందరూ పుస్తకాలను బాగా చదువుకుని సమాజంలో ఉత్తమ పౌరులుగా రాణించాలన్నదే ఇందులో ప్రధానమైన ఉద్దేశ్యం. ఇకనైనా, బాలలను మేధావు లుగా తీర్చిదిద్దేది పుస్తకపఠనమే అన్నది గుర్తుంచుకుని తల్లిదండ్రులు తమ పిల్లలకు, గురువులు తమ బడుల్లో విద్యార్థులకు పఠనాసక్తిని కలిగించి, వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది!...

**(జూన్ 19.. జాతీయ పఠన దినోత్సవం)**

# కోటీశ్వరులకు వేదికగా మారుతున్న పెద్దల సభ!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

పెద్దల సభగా పిలుచుకునే రాజ్యసభ కోటీశ్వరులకు వేదికగా మారుతోంది. టీడీపీ-జనసేన పార్టీలు రాజ్యసభకు అభ్యర్థులను ఎంపిక చేసిన తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇచ్చినట్లుగా స్పష్టమవుతోంది. దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసి, ప్రజల్లో తిరిగి, కేసులని సైతం ఎదుర్కొన్న నాయకులను పక్కనపెట్టి కోటీశ్వరులైన కార్పొరేట్ దిగ్గజాలకు పెద్దపీట వేయడం తీవ్రంగా బాధిస్తోంది. రాజ్యసభ అంటే 'పెద్దలసభ'. ఇది డబ్బు సంచులతో కొనుక్కునే పదవి కాదు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్నవారు, చట్టసభల్లో రాష్ట్ర గొంతుక వినిపించేవారు, గ్రామీణ ప్రాంతాల కష్టాలు తెలిసిన వారు అక్కడికి వెళ్లాలి. అలా కాకుండా ఎన్నికల వేళ ఖర్చులుపెట్టిన వారికీ, అధిక మొత్తంలో పార్టీ ఫండ్ ఇచ్చిన వారికీ రాజ్యసభ సీట్లు కట్టబెడుతున్నారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి రాత్రనకా పగలనకా పనిచేసిన యువతకి, కార్యకర్తలకి న్యాయం జరగడం లేదు. ఆ పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు నిజాయతీగా పార్టీ జెండా మోసినవారికి దక్కాల్సిన గౌరవాన్ని వ్యాపారవేత్తల పాదాల దగ్గర తాకట్టుపెట్టారు. రేపు పార్లమెంటులో రైతుల సమస్యపై మాట్లాడమంటే వీరంతా బ్యాలెన్స్ షీట్ చదువుతారా? వ్యాపారవేత్తలకి ఇవ్వడం తప్పు అన్నది నా ఉద్దేశం కాదు. వారిలోనూ సేవా దృక్పథం ఉన్న వారు ఉంటారు. కానీ, రాజకీయమే ఊపిరిగా బతికిన నాయకులని కాదని, కేవలం ఆర్థిక బలం చూసి రాజ్యసభ సీట్లు కట్టబెట్టడం అన్యాయం. ఈ విషయంలో అన్ని పార్టీలు పునరాలోచించాలి. రాజ్యసభ సీట్లు అంటే అమ్మకానికి పెట్టే వస్తువులు కావు. అవి రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడే ఆయుధాలు. ఆ ఆయుధాలు సరైన వారి చేతుల్లోనే ఉండాలి. ఇప్పటికైనా ప్రజల్లో మమేకమైన నాయకులకు అవకాశం ఇచ్చి, పార్టీ విలువలను కాపాడాలని కోరుతున్నాను.

*యం. చంద్రమౌళి*, **కొత్తఢిల్లీ.**

# ఆ రోడ్లకు అన్నమయ్య, బాలు పేర్లు పెట్టండి!

దేశంలోనే ఎక్కడా లేని విధంగా అమర గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఓ మహోన్నత స్మారకంలా వారి జన్మస్థలం నెల్లూరులో ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయం. ముందుగా ఈ కార్యక్రమాన్ని తలపెట్టి... మనసుపెట్టి పూర్తి చేసిన నిర్వాహకులకు నా అభినందనలు. అలాగే, ఇప్పటికే అన్నమాచార్యుల వారి విగ్రహ నిర్వహణ బాధ్యతలను చేపట్టిన విపిఆర్ ఫౌండేషన్, బాలు విగ్రహ నిర్వహణ బాధ్యతలతో పాటు అక్కడేవున్న ఎన్టీఆర్ పార్క్ బాగోగులను కూడా తామే చూస్తామని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారు ప్రకటించడం సంతోషదాయకం. నెల్లూరు నగరానికే తలమానికంగా అన్నమయ్య కూడలి రూపుదిద్దుకుంది. ఓ వైపు వాగ్గేయకారుడు, మరోవైపు భారతీయ సినిమా గాయకుడు. అన్నమయ్య సర్కిల్ నుండి ఇస్కాన్ మందిరం మీదుగా కొండాయపాళెం వైపు వెళ్లే రోడ్డుకి "అన్నమయ్య మార్గ్" అని, అలాగే అదే కూడలి నుండి వెంకటేశ్వరస్వామి గుడి మీదుగా మాగుంట లే అవుట్ వైపుకి వెళ్లే మార్గానికి "ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం మార్గ్" అని పేర్లు పెట్టవలిసిందిగా నా మనవి. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి గారు, రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గారు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని నా విజ్ఞప్తి.

*ఆర్.పీ.రామయ్య* - **కొండాయపాళెం, నెల్లూరు.**

# చైనాను సంతృప్తి పరచడానికే..

మనసులో మాట 101

ఆఫ్ఘనిస్థాన్ ఆకాశ సరిహద్దులను ఉల్లంఘిస్తూ పాకిస్థాన్ వైమానిక దళం కునార్, ఖోస్ట్, పక్తికా ప్రాంతాలపై కురిపించిన బాంబుల వర్షం.. ఇస్లామాబాద్ రక్షణ వ్యూహాల్లోని నైతిక దివాలాకోరుతనానికి నిదర్శనం. స్పేరా జిల్లాలోని మన్యా గ్రామంలో అర్ధరాత్రి నిద్రలో ఉన్న పౌర నివాసాలే లక్ష్యంగా జరిగిన ఈ తాజా దాడిలో ఒకే కుటుంబానికి చెందిన వారితో సహా అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. అత్యంత హృదయవిదారకమైన విషయమేమిటంటే, ఈ మృతులలో 11 మంది పసిపిల్లలు ఉన్నారు. సరిహద్దు అవతలి ఉగ్రవాద స్థావరాలపై 'ఇంటెలిజెన్స్ ఆధారిత దాడులు' చేస్తున్నామంటూ పాక్ సైన్యం చెప్పుకునే వంచనను, ఈ చిన్నారుల మృతదేహాలు అంతర్జాతీయ సమాజం ముందు నగ్నంగా నిలబెట్టాయి. ఒకవైపు అమాయకుల రక్తపాతం జరుగుతుంటే, మరోవైపు దీనిని కేవలం సాంకేతిక రక్షణ చర్యగా అభివర్ణించడం పాకిస్థాన్ పాలకుల క్రూరత్వానికి అద్దం పడుతోంది.

అంతర్జాతీయ రక్షణ రంగ నిపుణులు, దక్షిణాసియా భౌగోళిక రాజకీయ విశ్లేషకులు ఈ అమానవీయ వ్యూహాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ తాజా వైమానిక దాడులు కేవలం ఒక సరిహద్దు ఘర్షణ లేదా టి.టి.పి పై తీసుకుంటున్న ప్రతీకార చర్య మాత్రమే కాదు. దీని వెనుక ఒక బలమైన వ్యూహాత్మక కుట్ర దాగి ఉంది. నైరుతి ప్రాంతమైన బలూచిస్తాన్‌లో పాక్ సైనిక నియంత్రణ పూర్తిగా చేజారిపోతుందనే చేదు నిజాన్ని ప్రపంచం దృష్టి నుంచి, ముఖ్యంగా స్వదేశీ ప్రజల నుంచి మళ్లించడానికే ఇస్లామాబాద్ ఈ సరిహద్దు యుద్ధాన్ని తీవ్రతరం చేస్తోంది. తమ వైఫల్యాలను దాచడానికి పొరుగు దేశంలోని పౌరులను బలితీసుకోవడం అంతర్జాతీయ నియమాలను బేఖాతరు చేయడమే అవుతుంది.

ఈ ఏడాది ప్రారంభంలో బలూచ్ లిబరేషన్ ఆర్మీ 'ఆపరేషన్ హెరోఫ్ 2.0' పేరిట గ్వాదర్, క్వెట్టా, నుష్కీ సహా తొమ్మిది జిల్లాల్లో ఏకకాలంలో జరిపిన గెరిల్లా దాడులు పాకిస్థాన్ సైనిక ఇంటెలిజెన్స్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశాయి. పోలీస్ స్టేషన్లు, హైవేలు, మరియు కంటోన్మెంట్లపై స్థానిక బలూచ్ యువత జరిపిన ఈ సమన్వయ దాడులు.. బలూచ్ తిరుగుబాటు కేవలం కొద్దిమంది అసంతృప్తి కాదని, అది వ్యూహాత్మకంగా ఎదిగిన ఒక వ్యవస్థీకృత జాతీయవాద ప్రతిఘటన అని నిరూపించాయి. ఈ అంతర్గత పరాభవాన్ని తట్టుకోలేక, పాక్ సైన్యం ప్రారంభించిన 'ఆపరేషన్ రద్దో-ఉల్-ఫిత్నా 1' కూడా క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. సైన్యం అణచివేత చర్యలు ఎక్కువవుతున్న కొద్దీ స్థానిక ప్రజలలో తిరుగుబాటు ధోరణి మరింత తీవ్రరూపం దాల్చుతోంది.

ఉత్తర సరిహద్దులో ఆఫ్ఘన్ తాలిబాన్లతో సాయుధ పోరాటంలో సైన్యం బిజీగా ఉన్న సమయాన్ని చూసి, బలూచ్ తిరుగుబాటుదారులు నైరుతి ఫ్రంట్‌ను దెబ్బకొట్టారు. ఈ రెండు వైపుల పించర్ మూవ్‌మెంట్ ఇస్లామాబాద్‌ను తీవ్ర రక్షణలో పడేసింది. ఈ అంతర్గత రాజకీయ మరియు సామాజిక సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించే సత్తా లేక, పాకిస్థాన్ ఎప్పటిలాగే బాధ్యతను పక్క దేశంపై నెట్టేసే పాత పద్ధతినే ఎంచుకుంది. నిన్నటివరకు కేవలం మతపరమైన ఉగ్రవాదులకే ఆశ్రయం ఇస్తోందని ఆఫ్ఘనిస్థాన్‌ను నిందించిన ఇస్లామాబాద్, ఇప్పుడు సెక్యులర్ బలూచ్ వేర్పాటువాదులకు కూడా కాబూల్ ప్రభుత్వం లాజిస్టికల్ సపోర్ట్ ఇస్తోందనే కొత్త పల్లవి అందుకుంది. తద్వారా అంతర్జాతీయ సమాజం ముందు తానొక బాధితురాలినని నిరూపించుకోవడానికి పాక్ ప్రయత్నిస్తోంది.

ఈ సరిహద్దు దాడుల వెనుక అసలు కేంద్ర బిందువు చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్. 60 బిలియన్ డాలర్ల చైనా పెట్టుబడులతో నిర్మిస్తున్న గ్వాదర్ పోర్ట్ ప్రాజెక్ట్ ఇప్పుడు బలూచ్ దాడుల వల్ల తీవ్ర ముప్పులో పడింది. స్థానిక ప్రజల సమ్మతి లేకుండా, వారి వనరులను దోచుకుంటూ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులపై బలూచ్‌లు జరుపుతున్న దాడుల భయంతో పాకిస్థాన్‌లోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సగానికిపైగా పడిపోయాయని గణాంకాలు చెప్తున్నాయి. చైనాను సముదాయించడానికే, తాము ఏదో ఒకటి చేస్తున్నామని చూపించుకోవడానికి పాక్ సైన్యం ఆఫ్ఘన్ సరిహద్దుల్లో ఇంతటి క్రూరమైన దూకుడు ప్రదర్శించాల్సి వస్తోంది. కానీ ఈ బలవంతపు రక్షణ చర్యలు పెట్టుబడిదారులలో నమ్మకాన్ని పునరుద్ధరించలేకపోతున్నాయి. కానీ, అంతర్జాతీయ నిపుణుల హెచ్చరికల ప్రకారం.. ఇస్లామాబాద్ అనుసరిస్తున్న ఈ మిలిటరీ వైఖరి పూర్తిగా విఫలమైంది. దశాబ్దాలుగా సాగుతున్న బలవంతపు అదృశ్యాలు, మానవ హక్కుల ఉల్లంఘనలు బలూచ్ ప్రజల్లో అగ్ని పర్వతాన్ని రగిల్చాయి. ఇస్లామాబాద్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాల వల్ల స్థానిక తెగల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. కేవలం సైనిక బలగాలతో ఒక జాతి ఆకాంక్షలను నలిపేయడం సాధ్యం కాదని చరిత్ర నిరూపించింది.

ఆఫ్ఘనిస్తాన్‌లోని సరిహద్దు గ్రామాలను నాశనం చేసి, పసిపిల్లల రక్తం చిందించడం వల్ల బలూస్థాన్‌లోని స్థానిక ప్రజల ఆగ్రహం చల్లారదు. రాజకీయ సమస్యను కేవలం సైనిక కోణంలో చూస్తూ, స్వదేశీ తిరుగుబాటు మంటలను ఆర్పడానికి పక్కింటి పసిపిల్లలను బలితీసుకోవడం పాకిస్తాన్ స్వయంకృతాపరాధమే అవుతుంది. ఇస్లామాబాద్ తన సరిహద్దుల వెనుక ఉన్న అసలు సంక్షోభాన్ని గుర్తించి, అంతర్గత శక్తులతో చర్చలు జరపనంత కాలం.. ఈ వ్యూహాత్మక అంధకారం నుంచి అది బయట పడలేదు. అంతర్జాతీయ సమాజంలో ఒంటరి కాకుండా ఉండాలంటే పాకిస్తాన్ ఇప్పటికైనా తన రక్తసిక్త వ్యూహాలను మార్చుకోవాలి.



**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**

# పేదల కడుపుకొట్టిన వైసీపీ

## • మంత్రి నారాయణ మండిపాటు



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న మంత్రి నారాయణ, మేయర్ సుజాత, కమిషనర్ నందన్

గత వైసీపీ పాలకులు శాడిజంతో అన్నా క్యాంటీన్లను మూతవేయించి లక్షలాదిమంది పేదల కడుపు కొట్టారని రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ మండిపడ్డారు. పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో ప్రభుత్వం మారినా అమ్మా క్యాంటీన్లు నడుపుతుంటే, ఇక్కడ మాత్రం కక్షసాధింపు చర్యలకు దిగారని మండిపడ్డారు. నెల్లూరు సిటీ లోని ఇందిరాభవన్ రోడ్డులో ఉన్న 'అన్నా క్యాంటీన్'ను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఈనెల 10న ఆకస్మిక తనిఖీ చేశారు.. అక్కడ పేదలతో కలిసి స్వయంగా భోజనం చేసిన మంత్రి, వంటల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తెలుగుదేశం పార్టీపై కోపంతో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీపై కోపంతో, టీడీపీ చేపట్టిన అనేకరకాల ప్రజా సంక్షేమపథకాలను నిలుపుదల చేయించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నెల్లూరు నగరంలోనూ ఎన్నో అభివృద్ధి పనులు అర్థాంతరంగానే ఆగిపోయాయని, భూగర్భ డ్రైనేజీ పనులు కూడా అప్పట్లో నిలిచిపోయాయని ఆయన తెలిపారు. అయితే, ప్రజల ఆశీస్సులతో మళ్లీ కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 270 అన్నా కాంటీన్లను పునః ప్రారంభించి, కేవలం 5 రూపాయలకే అత్యంత నాణ్యమైన భోజనం అందిస్తూ పేదల ఆకలి తీరుస్తున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో సీఎం చంద్రబాబునాయుడు హామీ మేరకు అన్నా కాంటీన్ల సంఖ్యను భారీగా పెంచుతామని కూడా మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### కనుపర్తిపాడు దళితవాడ ప్రజలకి..

# ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి క్షమాపణ!

## • 70 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



దళితవాడ ప్రజలకి క్షమాపణలు చెబుతున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

**కనుపర్తిపాడు దళితవాడ ప్రజలకి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎలాంటి అభిజాత్యం లేకుండా మనస్ఫూర్తిగా క్షమాపణ చెప్పడం అక్కడి ప్రజలను ఆకట్టుకుంది. ఇటీవల 'నన్ను కూడా ప్రశ్నించవచ్చు' అంటూ ఆయన ఇచ్చిన పిలుపుకు స్పందించి కనుపర్తిపాడు దళితవాడ ప్రజలు తమ ప్రాంతంలో గత రెండేళ్ళుగా ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని తెలియ జేయడంతో ఆయన వారికి క్షమాపణ చెప్పి.. ఆ ప్రాంతంలో అభివృద్ధి పనులను మొదలుపెట్టారు.**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా తమ నియోజకవర్గంలోని కనుపర్తిపాడు దళితవాడలో ఒక్క రూపాయి అభివృద్ధి పని కూడా జరగకపోవడం బాధాకరమని, ఆ విషయం అక్కడి ప్రజలే తన దృష్టికి తీసుకువచ్చారని ఆయన చెప్పారు. సమన్వయ లోపంతో అలా జరిగి ఉండవచ్చని ఆయన విచారం వ్యక్తం చేస్తూ, ఈ సందర్భంగా అక్కడి ప్రజలకు ఆయన క్షమాపణలు తెలిపారు. అంతేకాదు, కేవలం క్షమాపణలతో సరిపెట్టుకోక, 74 లక్షల రూపాయలతో ఆ ప్రాంతంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి.. దటీజ్ శ్రీధర్‌రెడ్డి అనిపించుకున్నారు. ఆ అభివృద్ధి పనులకు జనసేన పార్టీ వీరమహిళలు కోలా విజయలక్ష్మి, నందినియాదవ్‌లతో కలసి శ్రీధర్‌రెడ్డి ఈనెల 11న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు లేనివేళ రాజకీయ జెండాలు.. అజెండాలు పక్కనపెట్టి అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తమ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు మంజూరయ్యాయని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువనేత నారా లోకేష్ బాబుల సహకారంతో ఆ పనులన్నీ శరవేగంగా జరుగుతున్నాయని ఆయన వివరించారు. రికార్డు స్థాయిలో 700 కోట్లతో రూరల్‌లో అభివృద్ధి పనులను చేపట్టామని, అందుకు వారికి కృతజ్ఞతలని తెలిపారు. అంతేకాక, యువనేత నారా లోకేష్ ఆకాంక్షలకి తగ్గట్టుగా అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళలకు కూడా ప్రాతినిధ్యం ఇవ్వాలని నిర్ణయించామని అన్నారు. రాబోయే 60 రోజుల్లో నెల్లూరు రూరల్‌లో ఎక్కడ ఏ అభివృద్ధి కార్యక్రమాలు జరిగినా పార్టీలకి అతీతంగా మహిళా నాయకురాళ్ళను ముఖ్యఅతిథులుగా ఆహ్వానిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆనందదాయకం!.. అభినందనీయం!



ప్రముఖ ఆధ్యాత్మిక - సామాజిక సేవాపరాయణులు
శాంత బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు
'పద్మభూషణ్'
డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి గారు
గతంలో అందుకున్న గౌరవ డాక్టరేట్ల పరంపరలో
మకుటాయమానంగా... తన జన్మభూమి నెల్లూరులో
విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నుంచి
రాష్ట్ర గవర్నర్ శ్రీ అబ్దుల్ నజీర్ గారి చేతులమీదుగా
ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్‌ను
అందుకున్న శుభ సందర్భంలో...
డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి గారికి
మా ఆత్మీయ శుభాకాంక్షలు...
హృదయపూర్వక శుభాభివందనాలు!

SMD HOMES
Value beyond Bricks
BANGALORE - BHARATH

# సర్వాంగసుందరంగా.. 'డీఎస్ఆర్ హైస్కూల్'

## • 20 కోట్లతో అత్యాధునిక భవనాలు






డీఎస్ఆర్ హైస్కూల్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

విద్యావ్యవస్థలో సరికొత్త చరిత్ర సృష్టిస్తూ, కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయి. జిల్లా విద్యారంగంలో మంత్రి నారాయణ తీసుకొస్తున్న విప్లవాత్మక సంస్కరణల్లో భాగంగా, నెల్లూరు 39వ డివిజన్ మూలపేటలో దాదాపు 20 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మించిన డీఎస్ఆర్ ప్రభుత్వ హైస్కూల్ నిర్మాణ పనులను మంత్రి నారాయణ ఇటీవల స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూలాపేటలో చదువుల తల్లి కోవెలగా ఓ అద్భుతమైన స్కూల్ బిల్డింగ్‌ను దాతల సహకారంతో సిద్ధం చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అందుబాటులోకి వచ్చిన ఈ కొత్త ప్రాంగణంలో, 24,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో 14 హైటెక్ క్లాస్‌రూమ్‌లను కేవలం ఎనిమిది నెలల రికార్డు కాలపరిమితిలో పూర్తి చేసి ఫర్నిచర్‌ను సిద్ధం చేశారని, ఇందులో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ ల్యాబ్‌లతో పాటు రాష్ట్రంలోనే అత్యంత ఆధునికమైన రోబోటిక్ ల్యాబ్‌ను కూడా ఏర్పాటుచేయడం విశేషమని మంత్రి చెప్పారు. కేవలం చదువే కాకుండా, పిల్లల ఆటల కోసం బెంగళూరు నిపుణులతో ప్రత్యేకంగా సింథటిక్ ఎనామిల్ కోటింగ్ వేయించిన కబడ్డీ కోర్ట్, క్రికెట్ నెట్, హాఫ్ బాస్కెట్‌బాల్, రెండు బాడ్మింటన్ కోర్టులు మరియు చిల్డ్రన్ ప్లే ఏరియాలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దారన్నారు. సురక్షితమైన ఆర్వో ప్లాంట్ తాగునీరు, ప్రథమ చికిత్స కోసం ప్రత్యేక సిక్ రూమ్ కూడా ఇక్కడ అందుబాటులోకి వచ్చాయని అంటూ, అందుకు సహకారం అందించిన దాత సుధాకర్‌రెడ్డికి, వారి కుటుంబసభ్యులకు నారాయణ కృతజ్ఞతలు తెలిపారు. గత ఏడాది ఆగస్టులో మంత్రి నారాయణ ప్రత్యేకంగా ఫోన్ చేసి నెల్లూరు మున్సిపల్ స్కూల్స్ అభివృద్ధికి ప్రతిపాదనలు పెట్టగా, వారిపై నమ్మకంతో మూలాపేట హైస్కూల్‌ను కేవలం 8 నెలల్లో కార్పొరేట్ స్థాయిలో నిర్మించడానికి అంగీకరించానని, ఆ అవకాశం కల్పించినందుకు మంత్రి నారాయణకు ధన్యవాదాలని ఈ సందర్భంగా దాత డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. 2.5ఎకరాల స్థలంలో అత్యద్భుత నిర్మాణాలకు సహకరించిన మూలాపేట ప్రజలకు ఆయన తన కృతజ్ఞతలు తెలిపారు.

### చెత్త పన్ను వేసి..రాష్ట్రాన్ని చెత్తకుప్ప చేశారు

వైసీపీ పాలన అంతా అస్తవ్యస్తమేనని, ప్రజలపై చెత్తపన్ను వేసి రాష్ట్రాన్ని చెత్తకుప్పగా మార్చారని మంత్రి నారాయణ ధ్వజమెత్తారు. పేదోడి నోళ్లు కొట్టి, మంచినీళ్లు దూరం చేసిన వైసీపీ నేతలకు టీడీపీని విమర్శించే అర్హత ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. వైసిపిపై 5,350 కోట్ల తాగునీటి నిధులను పక్కన పడేసిన వైసీపీది ప్రజాద్రోహ పాలన అని దుయ్యబట్టారు. నెల్లూరు నగరంలోని 13వ డివిజన్ యలమవారిధిన్నెలో ఆయన ఇటీవల పర్యటించి, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపి వదిలేసిన పెండింగ్ పనులన్నింటినీ కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తోందన్నారు. ఆర్వో ప్లాంట్లను పునరుద్ధరించి కేవలం 2రూపాయలకే 20లీటర్ల రక్షిత తాగునీటిని అందిస్తామన్నారు. రాష్ట్రంలో వైసిపి వదిలేసిన 153 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేస్తున్నామని, ఇప్పటికే 130 లక్షల టన్నుల వ్యర్థాలను ప్రాసెస్ చేసి సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలించామన్నారు.

## వైసీపీ అరాచక పాలనపై..

# ప్రజాతీర్పుకు రెండేళ్ళు



\- మంత్రి ఆనం

రాష్ట్రంలో వైసీపీ అరాచక, విధ్వంసక పాలనకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు చరమగీతం పాడి ఈనెల 4 నాటికి రెండేళ్లు పూర్తయిందంటూ రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని పరదాల మాటున బంధించి, ప్రజల గొంతు నొక్కిన రాక్షస పాలనకు ప్రజలు తీర్పు ఇచ్చి రెండేళ్లు గడిచిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఆలయాలపై దాడులు, కులాలపై దాడులు, మతాలపై దాడులు, చేసిన అరాచక శక్తుల పాలనకు ముగింపు పలికి రెండేళ్లయిందని, సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన వైసీపీ పాలనకు ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో గుణపాఠం చెప్పారని ఆయన అన్నారు. పరిశ్రమలను భయపెట్టి తరిమేసిన గత పాలన వల్ల రాష్ట్రానికి వేల కోట్ల పెట్టుబడులు, లక్షలాది ఉద్యోగ అవకాశాలు దూరమయ్యాయని, ఆ తర్వాత ప్రజల ఆశీర్వాదాలు, కేంద్ర ప్రభుత్వ సహకారం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మద్దతుతో రాష్ట్రం తిరిగి అభివృద్ధిబాటలో పయనిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టి, అనుభవం, సమర్ధ నాయకత్వంతో ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయని, యువనేత నారా లోకేష్ దేశ విదేశాల్లో పర్యటిస్తూ పెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## అర్హులైనవారంతా ఓటరుగా నమోదు కావాలి



\- సోమిరెడ్డి

అర్హులైనవారంతా ఓటరుగా నమోదు కావాలని, సమిష్టి కృషితో సమగ్ర ఓటరు జాబితాలు తయారుకావాలని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. వెంకటాచలం మండలం చెముడుగుంటలోని శ్రిడ్స్ కళ్యాణ మండపంలో ఓటరు జాబితాల సవరణ(సర్)పై తెలుగుదేశం పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎల్ఏలకు ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఓటరు జాబితాల రివిజన్ ప్రక్రియ 24 ఏళ్ల తర్వాత ఎలక్షన్ కమిషన్ చేపట్టిందని, జూన్ 15 నుంచి జూలై 14వతేదీ వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వచ్చి ఓటర్ల వివరాలు సేకరిస్తారని ఆయన తెలిపారు. అదేవిధంగా, జూలై14న పోలింగ్‌స్టేషన్ల పునర్ వ్యవస్థీకరణ చేపడతారని, జూలై 21వతేదీ నాటికి ముసాయిదా ఓటరు జాబితాలు ప్రచురిస్తారని పేర్కొన్నారు. ఆగస్టు 20వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారని, సెప్టెంబర్ 18వ తేదీ లోపు అభ్యంతరాలను పరిష్కరించి 22వ తేదీన తుది జాబితాలు ప్రకటిస్తారని, జాబితాలను పరిశీలించడంలో బీఎల్ఏలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.






కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' వార్తాపత్రిక



స్వర్గీయ దేవిరెడ్డి శారద గారు

లాయర్ 45 YEARS

అక్షరయాత్రలో విరామమెరుగని ప్రయాణం
ప్రజల హృదయవాకిళ్ళకు వెలుగుల తోరణం!

లాయర్
వార్తాపత్రికకి
45వ వార్షికోత్సవ శుభాభినందనలు.



దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి
మేనేజింగ్ డైరెక్టర్, డిఎస్ఆర్ గ్రూప్



దేవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డిఎస్ఆర్ గ్రూప్



దేవిరెడ్డి రఘురామిరెడ్డి
డిఎస్ఆర్ గ్రూప్



దేవిరెడ్డి దశరథరామిరెడ్డి
డిఎస్ఆర్ గ్రూప్

## ONGOING CHARITIES

- Devireddy Sarada Super Speciality Hospital, Nellore
- Devireddy Sarada Govt. High School, Mulapeta, Nellore
- Devireddy Sarada High School, Alluru
- Devireddy Sarada Primary Health Care Center, Alluru
- Devireddy Sarada Skill Development Center, Alluru

## ONGOING CONSTRUCTION PROJECTS

- THE ONE by DSR, Nellore
  G+33 Floor Premium Luxury Apartment
- G+8 5 Star Hotel with 126 Keys - Nellore
  Collaborated with ITC Hotels

DEVIREDDY SARADA
CHARITABLE TRUST

DSR® GROUP
CEMENTING DREAMS SINCE 1988

# నెల్లూరు కబుర్లు

## విద్యార్థినికి వీపీఆర్ ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థినికి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అండగా నిలిచారు. విద్యార్థిని ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షిస్తూ ఇటీవల లక్ష రూపాయలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కందుకూరు నియోజకవర్గం, ఉలవపాడు మండలం, కరేడు గ్రామపంచాయతీ పరిధిలోని అలాగాయ పాలెం గ్రామానికి చెందిన కటారి శ్రీకన్య స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతూ, ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో 587 మార్కులు సాధించి ప్రతిభ చాటింది. శ్రీకన్యకు చిన్నతనంలోనే తండ్రి రామయ్య మరణించగా, తల్లి సునీతమ్మ కష్టపడుతూ శ్రీకన్యతో పాటు మరో ఇద్దరు పిల్లలను పోషిస్తోంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ శ్రీకన్య సాధించిన ఉత్తమ మార్కుల గురించి తెలుసుకున్న ఎంపీ వేమిరెడ్డి నెల్లూరులోని తమ కార్యాలయంలో శ్రీకన్యను అభినందించారు. అనంతరం ఆమె పైచదువుల నిమిత్తం లక్ష రూపాయల నగదును అందజేశారు.

## పెట్రోధరలపై వామపక్షాల నిరసన



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నేతలు

పెట్రోలు, డీజిల్, గ్యాస్‌ధరల పెంపుదలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వామపక్ష పార్టీల వారు ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 9న నెల్లూరులో పలు పార్టీల వారు పెద్దఎత్తున నిరసనలు వ్యక్తం చేశారు. స్థానిక గాంధీబొమ్మ కూడలి వద్ద జరిగిన ఈ ఆందోళనలో ధరల పెంపుదలపై నాయకులు మండిపడ్డారు. పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అందరూ ఖండించాలన్నారు. పెట్రో ధరలు పెరగడంతో అన్నిరకాల వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనివల్ల రవాణా రంగంలో దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత నగరవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. విఆర్‌సి సెంటర్‌లో రాస్తా రోకో చేస్తుండగా, పోలీసులకు నాయకులకు మధ్య గొడవ జరిగి కొంతసేపు పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సీపీఎం నాయకులు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, మోహన్‌రావు, సీపీఐ నాయకులు అరిగెల నాగేంద్రసాయి, నాయకులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## 'విశ్వకర్మ' విగ్రహానికి అనుమతివ్వండి

నెల్లూరులోని పాత మునిసిపల్ కార్యాలయం ప్రాంగణంలో విశ్వకర్మ భగవానుని విగ్రహం ప్రతిష్ఠించేందుకు అనుమతిని మంజూరు చేయాలంటూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె యశ్వంత్‌సింగ్ కోరారు. ఆ మేరకు ఈనెల 8న ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ నందన్‌కి వినతిపత్రం అందజేశారు.

## ఆనం నివాసంలో ముగ్గురు మంత్రులు

- జిల్లా రాజకీయాలపై చర్చ



ఆత్మీయంగా పలకరించుకుంటున్న మంత్రులు ఫరూక్, నారాయణ, ఆనం

నెల్లూరులోని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసంలో బుధవారం జిల్లా ఇంచార్జ్ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ బుధవారం సమావేశమయ్యారు. జిల్లా రాజకీయాలపై కీలకమైన చర్చలు జరిపారు. జిల్లావ్యాప్తంగా పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే ఏకైక అజెండాగా సాగిన ఈ భేటీలో ముగ్గురు మంత్రులు పాల్గొని, నియోజకవర్గాల వారీగా క్యాడర్‌ను ఎలా బలోపేతం చేయాలి, పార్టీ పరంగా రాబోయే రోజుల్లో ఎలాంటి కార్యాచరణతో ముందుకు వెళ్లాలనే అంశాలపై ఒక పక్కా వ్యూహాన్ని రూపొందించినట్లు సమాచారం.

## ప్రజానేత ఆనం వెంకటరెడ్డి



ఆనం వెంకటరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆనం కైవల్యరెడ్డి

మాజీ మంత్రి, స్వర్గీయ ఆనం వెంకటరెడ్డి జిల్లా ప్రజానీకానికి ఎనలేని సేవలందించారని, ప్రజల సమస్యలు పరిష్కరించి ప్రజానేతగా పేరొందారని వక్తలు కొనియాడారు. ఆనం వెంకటరెడ్డి 31వ వర్ధంతి సందర్భంగా ఇటీవల నెల్లూరు ఆనం వెంకటరెడ్డి సర్కిల్‌లో, సంతపేటలోని ఆనం రామనారాయణరెడ్డి నివాసంలో... మరియు ఏసీ నగర్‌లోని ఆనం వెంకటరెడ్డి సమాధి వద్ద స్వర్గీయ ఆనం వెంకటరెడ్డికి ప్రజలు, అభిమానులు నివాళులర్పించారు. హోంశాఖ, నీటిపారుదలశాఖల మంత్రిగా ఆయన జిల్లా ప్రజలకు అందించిన సేవలను స్మరిస్తూ.. పుష్పాంజలి ఘటించారు. రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆయన కుమార్తె లీలాకైవల్య, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతోనే విజ్ఞానం

పుస్తక పఠనంతోనే చిన్నారులకు మంచి విజ్ఞానం లభిస్తుందని జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి కుమారరాజా చెప్పారు. ఈనెల 9న ప్రముఖ రచయిత పోట్లూరి సుబ్రహ్మణ్యం రచించిన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

'ప్రేమపూజారి-నిత్యసన్యాసి' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయాల్లో ఎన్నో అద్భుతమైన పుస్తకాలున్నాయని, పుస్తకాలు చదవడాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెరసం (పెన్నా రచయితల సంఘం) అధ్యక్షుడు అవ్వారు శ్రీధనబాబు, కార్యదర్శి గోవిందరాజు సుభద్రాదేవి తదితరులు పాల్గొని రచయిత పోట్లూరిని సన్మానించారు.

## ఆరోగ్యానికి దివ్యౌషధం..యోగా

### జేసీ వెంకటేశ్వర్లు



యోగాసనాలు వేస్తున్న జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు

సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు యోగా దివ్య ఔషధమని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 7న నెల్లూరులోని స్వర్ణాల చెరువు ట్యాంక్‌బండ్ వద్ద ఇరుకళలమ్మవారి ఆలయ సమీపంలో యోగాంధ్ర-2026 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, మనసును ఏకాగ్రతతో నిలిపివుంచే అద్భుతమైన ప్రక్రియ యోగా అని, మనదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరం యోగా అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21న నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో భారీ స్థాయిలో సామూహిక యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యోగా గురువులు ముత్యాల రవీంద్ర, సలీనా పర్యవేక్షణలో యోగాభ్యాసకులు యోగాసనాలు వేశారు. నోడల్ అధికారి, ఐటిడిఏ పీఓ శ్రీనివాసరావు, ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస రాజు, మున్సిపల్ కార్పొరేషన్ డీడీ మాధురి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలన అంతా అస్తవ్యస్తం

### - వైసీపీ నేత, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి ధ్వజం -



కూటమి ప్రభుత్వ పాలన అంతా అస్తవ్యస్థంగా ఉందని, రెండేళ్ళ కూటమి పాలనతో ప్రజలు విసిగిపోయారని వైసీపీ నేత, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే వైయస్‌ఆర్సీపీ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందన్నారు. నెల్లూరు 16వ డివిజన్ జగదీష్‌నగర్‌లో వైయస్సార్సీపీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం నిర్వహించారు. కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. నిరుద్యోగులకు ఇవ్వాల్సిన నిరుద్యోగ భృతికి పంగనామం పెట్టడమే కాకుండా.. రైతులను దగా చేస్తున్నారని మండిపడ్డారు. మెగా డీఎస్సీలో కూడా అక్రమాలకు పాల్పడి.. ఉపాధ్యాయ చదువులు చదివి.. డీఎస్సీ రాసి మెరిట్ సాధించిన అభ్యర్థులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు.

## 'ఆకాశవాణి'..ఆవిర్భావ వేడుకలు




సత్కారాలందుకున్న కవులు, కళాకారులు

ఆకాశవాణి (ఆలిండియా రేడియో) ప్రారంభమై 90 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా, ఈనెల 8న నెల్లూరులోని ఆకాశవాణి కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. ప్రోగ్రామ్ అధికారి టి.నాగేశ్వర రావు నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ, ఆకాశవాణి ప్రసారాల ప్రాధాన్యతను వివరించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో కూడా ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించిన ఏకైక ప్రసార సాధనం రేడియో అని, దాని ద్వారా ప్రజలు ఎంతో సమాచారాన్ని తెలుసుకునేవారని చెప్పారు. నేటికీ ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన సమాచారం అందుతోందని అన్నారు. అనంతరం, పలువురు కవులు, కళాకారులను సన్మానించారు. ఆకాశవాణి కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.





కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' వార్తాపత్రిక

జనం కోసం పోరాడే పత్రిక
ధర్మం కోసం కలమెత్తే పత్రిక
ప్రజల గొంతుకగా నినదించే పత్రిక
నెల్లూరీయుల మానస పుత్రిక

లాయర్
వార్తాపత్రికకి

45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

సి.వి.రెడ్డి
నెల్లూరు



# వేడుకగా వివిఎస్‌యు స్నాతకోత్సవం!

## రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా గౌరవ డాక్టరేట్లను స్వీకరించిన మన నెల్లూరీయులు

## పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు



***నెల్లూరు పరిధిలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం 10, 11, 12వ సంయుక్త స్నాతకోత్సవ వేడుకలు గొలగమూడి రోడ్డులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 9న వేడుకగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ గవర్నర్, యూనివర్శిటీ ఛాన్సలర్ ఎస్.అబ్దుల్‌నజీర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు పట్టాలను, బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దేశానికి ఉత్తమ సేవలందిస్తున్న నెల్లూరీయులు, ప్రస్తుత హైదరాబాద్ నివాసి.. శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ డాక్టర్ కెఐ వరప్రసాద్‌రెడ్డికి, ఆక్వారంగ నిపుణులు.. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుయాదవ్‌లకు రాష్ట్ర గవర్నర్ చేతులమీదుగా గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు. వీరితోపాటు నీతి ఆయోగ్ సభ్యులు, ప్రముఖ మాలిక్యులర్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ గోబర్ధన్‌దాస్ కూడా డాక్టరేట్‌ను అందుకున్నారు.***

వివిఎస్‌యు ఆధ్వర్యంలో జరిగిన ఈ స్నాతకోత్సవానికి మొత్తం 6,017మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో డిగ్రీ కోర్సుల నుండి 4,921 మంది, పీజీ మరియు ప్రొఫెషనల్ కోర్సుల నుండి 1,075 మందితో పాటు, 21 మంది పరిశోధక విద్యార్థులు పీహెచ్‌డీ పట్టాలను సాధించారు. వర్సిటీ నెల్లూరు మరియు కావలి కళాశాలల క్యాంపస్‌ల నుండి పలువురు పీజీ విద్యార్థులు పట్టాలు స్వీకరించారు. వివిధ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గవర్నర్ స్వర్ణ పతకాలను బహూకరించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.మధుమూర్తి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, వర్శిటీ మాజీ ఉపకులపతులు ఆచార్య సీ.ఆర్. విశ్వేశ్వరరావు, ఆచార్య రొక్కం సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు సమాజసేవలో భాగస్వాములు కావాలి

#### - గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపు

రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ ఎస్.అబ్దుల్‌నజీర్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ విద్యను వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులైన విద్యార్థులు జీవితంలో నైతిక విలువలను కాపాడుకుంటూ సమాజ సేవకు, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకుంటూ, ఉన్నత విద్యను గ్రామీణ ప్రాంతాలకు సైతం డిజిటల్ మాధ్యమాల ద్వారా చేర్చాలని సూచించారు. ప్రపంచాన్ని మార్చడానికి ఉపయోగించగల అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్యేనని నెల్సన్‌మండేలా మాటలను గవర్నర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రస్తుత కాలంలో డిజిటల్ పరివర్తన, కృత్రిమ మేధస్సు (AI) ప్రాధాన్యం రోజురోజుకు పెరుగుతోందని, ఉన్నత విద్యాసంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించి విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలంటే డిజిటల్ విద్యను విస్తృతంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు తమ వృత్తి జీవితంలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. కరుణ, నిజాయితీ, వినయం, పరస్పర గౌరవం వంటి విలువలను జీవితాంతం పాటించాలని, భారతరత్న డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం సందేశాన్ని గుర్తుచేస్తూ "ప్రపంచానికి మీ అత్యుత్తమ కృషిని అందించండి. అప్పుడు ప్రపంచం కూడా మీకు అత్యుత్తమ అవకాశాలు, గుర్తింపు, విజయాలను తిరిగి అందిస్తుంది" అని చెప్పారు. వర్శిటీ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ సాధించిన ప్రగతి నివేదికను సమర్పిస్తూ నాక్ ఎ-గ్రేడ్ గుర్తింపు వర్సిటీ సమిష్టి కృషికి నిదర్శనమన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, నెల్లూరు వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీ.హెచ్.విజయ, కావలి వర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీ.హెచ్.శ్రీనివాసరావు, వర్సిటీ పాలకమండలి సభ్యులు, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### ఆక్వారంగంలోనూ విశేష ఖ్యాతి

## బహుముఖ సేవలందిస్తున్న బీఎంఆర్

దేశంలో ఆక్వారంగమంటే ముందుగా గుర్తుకువచ్చే పేరు..బీఎమ్మార్‌దే. ప్రజల సమస్యలతోపాటు రొయ్యరైతుల కష్టాలు కూడా తీర్చేందుకు ఆయన చేస్తున్న కృషి అపారం. రాజ్యసభ సభ్యునిగా ఉంటూ, దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా ఆక్వా రంగం అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలు అమూల్యమైనవి. కష్టేఫలీ అనే మాటకి నిలువెత్తు నిదర్శనంగా ఉన్న బీఎంఆర్‌ను ఇటీవల రాష్ట్ర గవర్నర్ డా. అబ్దుల్ నజీర్ అభినందిస్తూ, వివిఎస్‌యు తరఫున ఆయనకు గౌరవ డాక్టరేట్‌ని అందజేశారు. నెల్లూరుజిల్లా అల్లూరు మండలం సముద్రతీర ప్రాంతమైన ఇస్కపల్లి గ్రామం బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) స్వస్థలం. చిన్ననాటి నుంచి కష్టపడే తత్వం. మేజర్ పంచాయతీ అయిన ఇస్కపల్లికి, బీఎంఆర్ తండ్రి గారైన బీద రమణయ్య అప్పట్లో సర్పంచ్‌గా కూడా సుదీర్ఘకాలం పనిచేశారు. ప్రాథమిక విద్యనంతా ఇస్కపల్లిలో చదివిన బీఎంఆర్ ఆ తర్వాత అల్లూరులో ఇంటర్, నెల్లూరులోని సర్వోదయ కళాశాలలో బీకాం పూర్తి చేశారు. 1979లో చెన్నైలో సీఏ చదివేందుకు వెళ్ళి, సీఏలో ఇంటర్ దాకా చదివారు. ఫైనల్ కోర్సు చదవడానికి పరిస్థితులు సహకరించకపోవడంతో, ఆ తర్వాత ఉద్యోగ ప్రస్థానం.. కొంత కాలం గడిచాక ఆక్వా వ్యాపారరంగంలోకి దిగారు. అన్ని కష్టనష్టాలను అధిగమించి వృద్ధిలోకి వచ్చారు. రాజకీయరంగంలో కూడా రాణిస్తూ తొలుత బోగోలు మండలం జడ్పీటీసీగా, ఆ తర్వాత 2009-14లో కావలి శాసనసభ్యునిగా పనిచేసి, అందరి మన్ననలు అందుకున్నారు. మానవతా హృదయంతో బీఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభించి నేటికీ ఎంతోమంది పేదలకి తనవంతు సాయం అందిస్తూనేవున్నారు. వెనుకబడిన వర్గాల(బీసీ) నాయకునిగా కూడా జిల్లాలోనే కాక, దేశవ్యాప్తంగా పేరుగడించారు. బీసీల హక్కుల సాధన కోసం పోరాడుతూనే ఉన్నారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యునిగా ఉంటూ ఆక్వారంగం అభివృద్ధికి అన్నివిధాలా చేయూతనందిస్తున్నారు. మారుమూల పల్లెటూరు అయిన ఇస్కపల్లి నుంచి ఢిల్లీలో రాజ్యసభ సభ్యుని దాకా బీఎంఆర్ జీవిత ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం కూడా. వారి సేవలకు గుర్తింపుగా వివిఎస్‌యు వారు గవర్నర్ చేతుల మీదుగా తనకు గౌరవ డాక్టరేట్‌ని బహుకరించడం పట్ల బీఎంఆర్ సంతోషం వ్యక్తం చేశారు.



## తల్లి ఒడిలో దక్కిన ఆశీస్సు!

### - సంతోషం వ్యక్తం చేసిన వరప్రసాద్‌రెడ్డి

బయోటెక్నాలజీ రంగంలో భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ప్రముఖ శాస్త్రవేత్త, పారిశ్రామికవేత్త డాక్టర్ కోడూరు ఈశ్వర వరప్రసాద్ రెడ్డిని వివిఎస్‌యు డాక్టరేట్ వరించింది. భారతీయ వైద్యరంగంలోనే హెపటైటిస్-బీ వ్యాక్సిన్ తయారీకి ఆద్యులైన వరప్రసాద్‌రెడ్డి దేశానికే గర్వకారణమైన శాస్త్రవేత్తగా ఖ్యాతినార్జించిన విషయం తెలిసిందే. నెల్లూరుజిల్లా తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాళెం వారి స్వస్థలం. 1993లో హైదరాబాద్ కేంద్రంగా శాంతా బయోటెక్నిక్స్ లిమిటెడ్ సంస్థను స్థాపించి, దేశంలో మొట్టమొదటిసారిగా స్వదేశీ సాంకేతికతతో కూడిన హెపటైటిస్-బి వ్యాక్సిన్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చి, తద్వారా ఎందరో రోగుల ప్రాణాలు కాపాడారు. ఆ తర్వాత కాలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఎన్నో ప్రాణరక్షక మందులు, వ్యాక్సిన్లను అత్యంత తక్కువ ధరకే సామాన్యులకు అందుబాటులోకి తెచ్చిన ఘనత కూడా ఆయనదే. వారి సేవలకు గుర్తింపుగా గతంలోనే భారత ప్రభుత్వం పతిష్టాత్మకమైన 'పద్మభూషణ్' పురస్కారంతో సత్కరించింది. ఇటీవలే ఆయన చదువుకున్న కాకినాడ కాలేజీ వారు ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసి సన్మానించారు. ప్రముఖ ఆధ్యాత్మిక సేవాపరాయణులుగా, సారస్వతవేత్తగా సమాజాభ్యుదయానికి ఆయన పాటుపడుతూనే ఉన్నారు. ఇప్పటికే నాలుగు డాక్టరేట్‌లతో పాటు, అనేక ఘనసత్కారాలు, పురస్కారాలు అందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి ఆయన. వివిఎస్‌యు గౌరవ డాక్టరేట్‌తో 5 డాక్టరేట్‌లు లభించడం ఆయన ప్రజ్ఞాపాటవాలకు, అమూల్యమైన-అపారమైన సమాజసేవాభిలాషకి నిదర్శనంగా భావించవచ్చు. నెల్లూరు మట్టిలో పుట్టిన బిడ్డగా తనకు దక్కిన ఈ గౌరవం తల్లి ఒడిలో దక్కిన ఆశీస్సుగా భావిస్తున్నానని, వివిఎస్‌యు నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకోవడం తనకెంతో సంతృప్తిగా ఉందని ఆయన అన్నారు. విశ్వవిద్యాలయాలు కేవలం ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా, స్వయం సమృద్ధిని సాధించాలని అన్నారు. దేశ పురోగతికి పరిశోధన ఆవిష్కరణలు ఎంతో కీలకమని, విద్యార్థులు ఉద్యోగాల వెనుక పడకుండా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో స్వయంగా పారిశ్రామికవేత్తలు కావాలని ఆయన పిలుపునిచ్చారు.




## శ్రీసిటీలో పర్యావరణ దినోత్సవం

నేడు నాటిన ప్రతి మొక్క రేపటి హరిత, ఆరోగ్యకర, వాతావరణ మార్పులను తట్టుకునే భవిష్యత్తుకు పునాది' అని వక్తలు ఉద్ఘాటించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026ను పురస్కరించుకుని శ్రీసిటీలో ఇటీవల మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు ఎన్.నాగేశ్వరరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రాంతీయ డైరెక్టర్ హెచ్.డి. వరలక్ష్మితో పాటు, శ్రీ సిటీ హార్టికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్ విభాగం ఇన్‌చార్జి డి.ఎన్.రెడ్డి, సత్యవేడు అటవీ శాఖ రేంజ్ అధికారి త్రినాథరెడ్డి తన సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. నాగేశ్వరరాజు మాట్లాడుతూ, "వాతావరణ మార్పులను ఎదుర్కొని, భూమి భవిష్యత్తును కాపాడటం మనందరి ఉమ్మడి బాధ్యత' అన్నారు. డి.ఎన్.రెడ్డి మాట్లాడుతూ, శ్రీసిటీలో ఇప్పటివరకు 10




మొక్కలు నాటుతున్న నాగేశ్వరరాజు, తదితర అధికారులు

లక్షలకు పైగా మొక్కలు నాటారని, ఈ ఏడాదిలో మరో పది వేలకుపైగా మొక్కలు నాటే ప్రణాళిక ఉందని, 40 రకాల వృక్ష జాతులను ప్రవేశపెట్టే ప్రణాళికను అమలు చేస్తున్నామని చెప్పారు.

## డిఆర్‌సి సమావేశంలో..

# జిల్లా అభివృద్ధిపై సుదీర్ఘ చర్చ

### • పాల్గొన్న మంత్రులు, ప్రజా ప్రతినిధులు



సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఎన్.ఎం.డి.ఫరూక్, ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎంపీ బీద మస్తాన్‌రావు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

జిల్లా అభివృద్ధి విషయమై ఈనెల 10న జిల్లాకి చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌ఛార్జ్, రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ అధ్యక్షతన జిల్లా సమీక్షా కమిటీ సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలతో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరు మరియు ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు, మంత్రులు సుదీర్ఘంగా సమీక్షించారు.

అనంతరం ఇన్‌చార్జి మంత్రి ఫరూక్ విలేకర్లతో మాట్లాడుతూ, రాబోయేది ఖరీఫ్ సీజన్ కావడంతో ఎక్కువగా వ్యవసాయం, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ మరియు మత్స్య శాఖలపైనే ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ముఖ్యంగా నెల్లూరు జిల్లాలో పొగాకు పండిస్తున్నప్పటికీ వారికి పొగాకు బోర్డులో సభ్యత్వం మరియు తగిన గుర్తింపు లేకపోవడంపై ఒక తీర్మానాన్ని ఆమోదించామన్నారు. అలాగే జొన్న పంటకు ప్రభుత్వం 3,699 మద్దతు ధర ప్రకటిస్తే, మార్కెట్లో 2,700 నుండి 3,000 లోపే పలుకుతుండటంతో ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించామని మరియు మొక్కజొన్న కొనుగోళ్లపై కూడా చర్చించామన్నారు.

రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, వాతావరణ మార్పుల నేపథ్యంలో సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని అత్యంత జాగ్రత్తగా వాడుకోవాలని, నీటిపారుదల శాఖలో ఏ మాత్రం వృథా కాకుండా ప్రతి చుక్కను రైతులకు అవసరమైన మేరకే విడుదల చేయాలని అధికారులను కోరారు.

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా.పొంగురు నారాయణ మాట్లాడుతూ త్వరలోనే వర్షాకాలం ప్రారంభం కాబోతున్నందున కండలేరు, సోమశిల జలాశయాల నీటి నిల్వలపై సమీక్షించి, సాగునీటి ప్రధాన కాలువల రిపేర్ల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో కాలనీల ఏర్పాటుకు, స్కూళ్ల నిర్మాణానికి స్థలాలు ఇచ్చిన దాతలను గౌరవిస్తూ ఆయా ప్రాంతాలకు ఆయా దాతల పేర్లనే పెట్టాలని ఈ సమావేశంలో తీర్మానం చేశామని తెలిపారు.

ఈ సమావేశంలో శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## సోమిరెడ్డి చొరవతో..

# పోలీసులకు డ్రోన్లు, వ్యాన్లు



జెండా ఊపి వ్యాన్‌లను పోలీసు శాఖకు అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, పక్కన ఏఎస్పీ సౌజన్య

మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవతో, ఎస్ఇఐఎల్ కంపెనీ సహకారంతో జిల్లా పోలీసు యంత్రాంగానికి రూ. 24.25 లక్షల విలువైన ఆరు సర్వైలెన్స్ డ్రోన్లు, రూ. 20.65 లక్షల విలువైన రెండు వ్యాన్లు సమకూరాయి. ఎస్ఇఐఎల్ కంపెనీ వారు అందించిన ఆ డ్రోన్లు, వ్యాన్లను ఈనెల 10న సోమిరెడ్డి నెల్లూరులోని ఆర్ అండ్ బీ అతిథిగృహం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సౌజన్య సమక్షంలో పోలీసుశాఖకు అందజేశారు. ఎస్ఇఐఎల్ కంపెనీ ప్రతినిధులు ఆల్బర్ట్, రఘురామ్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ఇవెంతో ఉపయోగపడతాయన్నారు. ఎస్ఇఐఎల్ కంపెనీ సర్వేపల్లి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తోందని ఆయన ఆ కంపెనీ సీఇఓ జనమేజయ మహాపాత్రను, వారి సిబ్బందిని అభినందించారు.

# రొట్టెల పండుగకు భారీ ఏర్పాట్లు

నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 26 నుంచి 30వతేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు తరలివస్తారు కనుక, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాల కల్పనకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు ప్రారంభించారు. దర్గా చెంతనే ఉన్న స్వర్ణాల చెరువు ఘాట్‌ను కూడా శుభ్రపరిచి సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మహిళలు, పురుషులు విశ్రాంతి తీసుకునేందుకు పెద్దపెద్ద టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు.




కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' వార్తాపత్రిక

కలమే.. లాయర్ బలం
పాఠకులే.. లాయర్ బలగం
లాయర్ వార్తాపత్రికకి
45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

లాయర్ 45 YEARS



డా॥ నాగార్జున - సంధ్యారాణి
డా॥ దీపక్ - డా॥ దివ్య, బేబి దీక్షిత
డా॥ సృజన - డా॥ సందీప్

# గూడూరు డివిజన్

## కోట మండలం ఎంపీపీ..
# తెలుగుదేశం వశం

- చక్రం తిప్పిన ఎమ్మెల్యే సునీల్
- సత్తాచాటిన వినోద్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్, పక్కన ఎంపీపీ ఎంబేటి శశి తదితరులు

గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ చక్రం తిప్పడం, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి సత్తా చాటడంతో కేవలం మూడు ఎంపీటీసీ స్థానాలున్న తెలుగుదేశం పార్టీ గూడూరు డివిజన్‌లోని కోట మండలం ఎంపీపీ స్థానాన్ని కైవశం చేసుకుంది. మొత్తం 16 ఎంపీటీసీలు ఉన్న కోట మండలంలో ఇద్దరు వైకాపా ఎంపీటీసీలు మరణించడంతో 14 మంది ఎంపీటీసీలు ఓటింగ్‌కి హాజరు కావాల్సి వచ్చింది. అయితే, ఇద్దరు వైకాపా ఎంపీటీసీలు గైర్హాజరవడం, నలుగురు వైకాపా ఎంపీటీసీలు తెలుగుదేశంలో చేరడంతో ఏడు ఓట్లతో కోట మండలం ఎంపీపీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఎంబేటి శశి గెలుచుకున్నారు.

# సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దు


అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 8న గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. సమస్యలు తెలుసుకొన్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు సత్వరం పరిష్కరించాలని, జాప్యం చేయొద్దని ఆదేశించారు. నాయకులు శీలం కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీవోగా అరుణకుమారి



గూడూరు ఆర్డీవోగా అరుణ కుమారి ఈ నెల 5న సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అరుణకుమారి ఉద్యోగోన్నతిపై గూడూరు ఆర్డీవోగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారికి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. అనంతరం గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు ఆమెను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆరు నెలలుగా వేతనాలు చెల్లించలేదని
# పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన


ప్రాంతీయ వైద్యశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

గూడూరు ప్రాంతీయ వైద్యశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం దారుణమని సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్ మండిపడ్డారు. గూడూరులోని ప్రాంతీయ వైద్యశాల వద్ద ఈనెల 9న కార్మికులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు శశికుమార్, వెంకటేశ్వర్లు, జమాలుల్లా తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు

# బీజేపీతోనే దేశాభివృద్ధి

గూడూరు పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో బీజేపీ నియోజకవర్గ క్రియాశీలక కార్యకర్తల సమావేశం ఇటీవల నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. గూడూరు ప్రజల ఆకాంక్ష నెల్లూరుజిల్లాలో కలవడం అని, కూటమి ప్రభుత్వం జిల్లా మార్పు చేసిందని తెలిపారు. బీజేపీ దేశానికి అవినీతి లేని పాలన అందిస్తోందని, నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తలు, నాయకులు బీజేపీని బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, బాలకృష్ణంనాయుడు, పనబాక కోటేశ్వరరావు, దయాకర్, ప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

# వికలాంగులకి నిత్యావసర వస్తువులు


నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న డా. రోహిణి

గూడూరు, త్యాగరాజవీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్రస్వామి దేవస్థానంలో ఇటీవల రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్ మరియు ఆంధ్ర మహిళా మండలి వారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాత డా. సి.రోహిణి ముఖ్యఅతిథిగా పాల్గొనగా, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు బి.మాధురి, లక్ష్మీ, జీవని, నిర్మల, సుప్రజ, సుప్రియ, జానా సుధీర్, పల్లం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# OBITUARY

In loving memory of
the Legend of our family

**Late SINGAMREDDY VENKATA SUBBA REDDY Garu**

Who passed away on 28.05.2026.

**MAY HIS SOUL REST IN PEACE**

Daughter - Son-in-law
**CHAMUNDESWARI & HARANATH**
Washington DC. USA

Son - Daughter-in-law
**VIJAYARAMI REDDY & JYOTHI**
Nellore

Grand Daughters
**Dr. DEEPIKA & Dr. VARUN**
California USA

**Dr. HARIKA & SANTOSH**
Virginia USA

**SWAPNIKA & AMARESH**
Nellore

**SATVIKA**
Virginia USA

Great Grand Children:
**ARJUN, DHARAN, ASHA, VELAN**

# ప్రత్యేక నైపుణ్యంతోనే అపార అవకాశాలు

వాణిజ్య విద్య అంటే చాలామందికి ఇప్పటికీ రెండు పేర్లు మాత్రమే గుర్తుకు వస్తాయి. CA వంటి సంప్రదాయ వృత్తులు, MBA వంటి ప్రసిద్ధ ఉన్నత విద్యా మార్గాలు. ఈరెండూ ఎంతో గౌరవనీయమైనవే అయినా, నేటి ప్రపంచం మాత్రం వాటికంటే ఎంతో విస్తృతమైన అవకాశాలను యువత ముందుంచుతోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతున్న ఈ కాలంలో, వాణిజ్య విద్యార్థులకు అందుబాటులో ఉన్న మార్గాలు అనేకం. "జ్ఞానం విస్తరిస్తే దారులు విస్తరిస్తాయి" అన్నట్లుగా, ఒకే రెండు వృత్తులకే పరిమితం కాకుండా, తమ ఆసక్తులు, సామర్థ్యాలు, వ్యక్తిత్వం ఆధారంగా ఎన్నో రంగాల్లో ఎదగవచ్చు. నేటి వ్యాపార ప్రపంచం డిజిటల్ మార్పులతో కొత్త రూపం దాల్చింది. ఆర్థిక విశ్లేషణ, పెట్టుబడి నిర్వహణ, డేటా ఆధారిత వ్యాపార నిర్ణయాలు, అంతర్జాతీయ వాణిజ్యం, ఈ-కామర్స్, సరఫరా గొలుసు నిర్వహణ (సప్లై చైన్ మేనేజ్‌మెంట్) వంటి రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఉదాహరణకు, ఒక చిన్న వ్యాపార సంస్థ కూడా నేడు డేటా విశ్లేషణ ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో వాణిజ్య విద్యార్థులు తమకు నచ్చిన రంగంలో ప్రత్యేక నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే, ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు విస్తరిస్తాయి.

అకౌంటింగ్ రంగం కూడా ఇప్పుడు పాత పద్ధతులకే పరిమితం కాదు. ఫోరెన్సిక్ అకౌంటింగ్, మేనేజ్‌మెంట్ అకౌంటింగ్, ఇంటర్నల్ ఆడిట్, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి ప్రత్యేక విభాగాలు వేగంగా ఎదుగుతున్నాయి. ఉదాహరణకు, ఒక పెద్ద సంస్థలో ఆర్థిక మోసాలను గుర్తించడానికి ఫోరెన్సిక్ అకౌంటెంట్ అవసరం అవుతుంది. ఇది సాధారణ అకౌంటింగ్ కంటే భిన్నమైన, పరిశోధనాత్మక దృష్టి కావాలి. ఇలాంటి రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకుంటే, యువతకు మంచి ఆదాయం కలిగిన వృత్తులు దక్కుతాయి.వ్యాపార విశ్లేషణ (బిజినెస్ అనలిటిక్స్) నేటి కాలంలో వేగంగా ఎదుగుతున్న రంగం. డేటా ఆధారంగా వ్యాపార నిర్ణయాలు తీసుకోవడం ప్రతి సంస్థకు అవసరం. ఒక రిటైల్ సంస్థలో ఏ ఉత్పత్తులు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి, ఏ ప్రాంతంలో డిమాండ్ ఎక్కువ, ఏ వయస్సు గల వినియోగదారులు ఏ ఉత్పత్తులు ఇష్టపడుతున్నారు.. ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు కనుగొనడం బిజినెస్ అనలిస్టుల పని. "వివేకమే విజయానికి వేదిక" అని పెద్దలు చెప్పినట్లుగా, వాణిజ్య విద్యార్థులు గణాంకాలు, డేటా విశ్లేషణ, వ్యాపార అవగాహన కలిపి నేర్చుకుంటే, ఈ రంగంలో అగ్రస్థానాలు సాధించవచ్చు.

**పెట్టుబడి రంగానిది కూడా కీలకపాత్రే:**

పెట్టుబడి రంగం కూడా వాణిజ్య విద్యార్థులకు అపారమైన అవకాశాలు అందిస్తోంది. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్, ఈక్విటీ రీసెర్చ్, ఫైనాన్షియల్ ప్లానింగ్ వంటి విభాగాలు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైనవి. ఉదాహరణకు, ఒక పెట్టుబడి సలహాదారు కుటుంబాల ఆర్థిక భవిష్యత్తును సురక్షితం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాడు. "ధనం ధర్మానికి దారి చూపాలి" అనే భావం ఇక్కడ వర్తిస్తుంది. పెట్టుబడులను సక్రమంగా నిర్వహించడం, ప్రమాదాలను అంచనా వేయడం, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించడం వంటి నైపుణ్యాలు నేర్చుకుంటే, ఈ రంగంలో మంచి స్థానం పొందవచ్చు. అంతర్జాతీయ వాణిజ్యం కూడా వాణిజ్య విద్యార్థులకు ఆకర్షణీయమైన రంగం. ప్రపంచ దేశాల మధ్య వ్యాపార ఒప్పందాలు, దిగుమతి-ఎగుమతి విధానాలు, కరెన్సీ మార్పిడి, అంతర్జాతీయ మార్కెట్ ధోరణులు-ఇవి అన్నీ ఈ రంగంలో భాగం. ఉదాహరణకు, ఒక సంస్థ విదేశాలకు ఉత్పత్తులు పంపాలంటే, ఆ దేశపు నిబంధనలు, పన్నులు, రవాణా విధానాలు అన్నీ తెలుసుకోవాలి. ఈ రంగంలో నైపుణ్యం ఉంటే, ప్రపంచవ్యాప్తంగా పనిచేసే అవకాశాలు లభిస్తాయి.

**మంచి ఆలోచనలతోనే పురోగతి :**

ఈ-కామర్స్ రంగం కూడా వాణిజ్య విద్యార్థులకు కొత్తఅవకాశాలను తెరుస్తోంది. ఆన్‌లైన్ డిజిటల్ మార్కెటింగ్, కస్టమర్ అనుభవ నిర్వహణ, సరఫరా గొలుసు నిర్వహణ వంటి విభాగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఉదాహరణకు, ఒక ఆన్‌లైన్ స్టోర్‌లో ఉత్పత్తులు ఎలా ప్రదర్శించాలి, వినియోగదారుల అభిరుచులు ఎలా అర్థం చేసుకోవాలి, సరుకు సమయానికి ఎలా చేరాలి. ఇవిఅన్నీ ప్రత్యేక నైపుణ్యాలు. "కాలానికి తగ్గ మార్పు మనిషిని ముందుకు నడిపిస్తుంది"అనే సూక్తి ఈ రంగానికి వర్తిస్తుంది. ఉద్యమిత (ఎంట్రప్రెన్యూర్‌షిప్) కూడా వాణిజ్య విద్యార్థులకు అత్యంత శక్తివంతమైన మార్గం. చిన్న వ్యాపారాల నుండి పెద్ద సంస్థల వరకు, కొత్త ఆలోచనలతో ముందుకు వచ్చే యువతకు నేటి ప్రపంచం ఎన్నో అవకాశాలు ఇస్తోంది. ఉదాహరణకు, ఒక విద్యార్థి స్థానిక అవసరాన్ని గుర్తించి, దానికి అనుగుణంగా సేవను ప్రారంభిస్తే, అది పెద్ద వ్యాపారంగా ఎదగవచ్చు. వ్యాపారం అంటే కేవలం లాభం మాత్రమే కాదు, సమాజానికి విలువను సృష్టించడం కూడా.

సరఫరా గొలుసు నిర్వహణ కూడా వాణిజ్య విద్యార్థులకు విస్తృత అవకాశాలు అందిస్తోంది. ఉత్పత్తి తయారీ నుండి వినియోగదారుని చేతికి చేరే వరకు జరిగే ప్రతి దశను సమర్థవంతంగా నిర్వహించడం ఈ రంగం పని. ఉదాహరణకు, ఒక ఔషధ సంస్థలో మందులు సమయానికి అందకపోతే, అది ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. అందుకే ఈ రంగంలో నైపుణ్యం కలిగిన వ్యక్తులు అత్యంత అవసరం. మొత్తానికి, వాణిజ్య విద్యార్థులు తమ భవిష్యత్తును కేవలం రెండు వృత్తులకే పరిమితం చేసుకోవాల్సిన అవసరం లేదు. ప్రపంచం మారుతోంది, వ్యాపార విధానాలు మారుతున్నాయి, అవకాశాలు విస్తరిస్తున్నాయి. తమ ఆసక్తి, నైపుణ్యం, కృషి ఆధారంగా ఎన్నో రంగాల్లో ఎదగవచ్చు.



**వచ్చే వారం:** సృజన శక్తి నుంచి ఉపాధి వరకు: డిజైన్, సినిమా, రచన, గేమింగ్ కొత్త దారులు

జ్ఞాన నేత్రం - డా. నరసింహారెడ్డి ఊరిమిండి, Dallas, Texas, USA

E-mail: reddyu@gmail.com

# తొలి 'కళాప్రపూర్ణ' వేదం వేంకటరాయశాస్త్రి



కీర్తిమూర్తులు

నేటి జీవితపు పోటీ ప్రపంచంలో, తరచుగా మన మూలాలను మనం మరచిపోతుంటాము. కానీ, వేదం వేంకటరాయశాస్త్రి వంటి రచయితలు మన సంప్రదాయాలను, వాటి విలువను వారి రచనలద్వారా మనకు నిత్యం గుర్తు చేస్తూనే ఉంటారు. వేదం వేంకటరాయశాస్త్రి సుప్రసిద్ధ పండితుడు, కవి, విమర్శకుడు, నాటకకర్త. మహోపాధ్యాయులు, సర్వతంత్ర స్వతంత్రులు, కళాప్రపూర్ణుడు, వ్యాఖ్యానమల్లినాథునిగా ఆయన చిరకీర్తి ఆంధ్రుల హృదయాల్లో శాశ్వతస్థానం ఉన్నది. శాస్త్రిగారు వేంకట రమణ శాస్త్రి, లక్ష్మమ్మ దంపతులకు 1853, డిసెంబర్ 21న జన్మించారు. వీరి స్వస్థలం నెల్లూరుజిల్లాలోని మల్లయపాళెం గ్రామం. వీరి తండ్రిగారు చిన్నయసూరికి సహపాఠులు. వారు పెక్కుచోట్ల ఉద్యోగం చేయడం వలన వేంకటరాయశాస్త్రి తండ్రితో అనేక ప్రదేశములు దర్శించడం వలన వ్యవహార భాషాసంప్రదాయములను గ్రహించారు. బి.ఎ. పరీక్షలలో ఆంగ్లం, సంస్కృతం లలో ప్రథమస్థానంలో ఉత్తీర్ణుడయ్యారు. మద్రాసు క్రైస్తవ కళాశాలలో సంస్కృత పండితపదవిని 25 సంవత్సరాలు సమర్థవంతంగా నిర్వహించారు.

వేంకటరాయ శాస్త్రి గ్రాంథిక భాషావాది. సాహిత్య ప్రక్రియల్లో వ్యవహారిక భాషాప్రయోగాన్ని విమర్శించారు. ఈయన 1899లో తెలుగు భాషాభిమాని నాటక సమాజాన్ని స్థాపించారు. ఈ సంస్థలో వెంకటరాయ శాస్త్రి వ్రాసిన నాటకాలని ప్రదర్శించేవారు. వీరు నాటకరంగానికి చేసిన సేవ అపారమైనది. వీరు ఇంచుమించు 30 సం.లు తమ సమాజంద్వారా నాటకాలను ప్రదర్శించి రజతోత్సవం జరుపుకొన్నారు. ఈయన మూల నాటకాలలో 1897లో వ్రాసిన ప్రతాపరుద్రీయ నాటకం, 1901లో వ్రాసిన ఉషా నాటకం, 1916లో వ్రాసిన బొబ్బిలియుద్ధము ప్రముఖమైనవి. వీటిలో ప్రతాపరుద్రీయం అనర్ఘరత్నము. ఒకప్పుడు ఈ నాటకంలోని "ఢిల్లీ సుల్తాన్ పట్టుకుపోతాన్" అనే డైలాగు ఆంధ్రదేశం మొత్తం మారుమ్రోగింది. వీరు నాగానందము(1891) నాటకాన్ని సంస్కృతము నుండి తెలుగులోకి అనువాదం చేసినప్పుడు నీచపాత్రలకు వ్యవహారిక భాషను వాడారు. ఈ ప్రయోగం సంస్కృత నాటకాల్లో నీచపాత్రలకు ప్రాకృతం ఉపయోగించిన విధంగానే అని శాస్త్రి సమర్థించినప్పటికీ, భాషావాదులు భాషాపతనం అని విమర్శించినప్పటికి, తరువాతి కాలంలో శాస్త్రిగారి పంథానే అనేక మంది సాహితీకారులు అనుసరించక తప్పలేదు. ఇవేకాక వీరు అభిజ్ఞాన శాకుంతలము (1896), మాళవికాగ్నిమిత్రము (1919), ఉత్తరామచరితం (1920), విక్రమోర్వశీయం (1921), అనే సంస్కృత నాటకాలను తెనిగించారు.

శాస్త్రిగారు జ్యోతిష్మతీ అనే ముద్రణశాలను పునరుద్ధరించి అనేక సంస్కృతాంధ్ర గ్రంథాలకు వాఖ్యానాలు వెలయించారు. వీరి వ్యాఖ్యలలో మేఘసందేశ వ్యాఖ్య (1901), శృంగారనైషధ సర్వంకష వ్యాఖ్య (1913), ఆముక్తమాల్యద సంజీవని వ్యాఖ్య (1921) అమరుకావ్యము (ఆంధ్రవ్యాఖ్య) ప్రశస్తమైనవి. వీరు ఇంకా ప్రియదర్శిక (1910), ఆంధ్ర ప్రసన్న రాఘవ విమర్శనము (1898), స్త్రీ పునర్వివాహ దుర్వాద నిర్వాపణం (1899), గ్రామ్య భాషా ప్రయోగ నిబంధనము (1899), తిక్కన సోమ యాజివిజయము (1919), విమర్శవినోదం (1920), ఆంధ్రహితోపదేశ చంపువు, ఆంధ్ర సాహిత్య దర్పణము (1921), ఆంధ్ర దశకుమార చరిత్రము అనే గ్రంథాలు రచించారు. వీరు మొత్తం 47 గ్రంథాలను రచించినట్లు తెలుస్తున్నది. శాస్త్రిగారి రచనలు నేటి సమాజానికి మూలస్తంభంగా నిలిచిన భారతీయ సంప్రదాయ విలువలను నిలబెట్టాయనడంలో ఎట్టి అతిశయోక్తి లేదు. 1916 సం.లో సూర్యరాయాంధ్ర నిఘంటువుకు ప్రధాన సంపాదకులుగా కొంతకాలం పనిచేశారు.

వీరు గ్రాంథికవాది అయినప్పటికీ మొండితనమునకుబోక నియామాను సారము గ్రామ్యము, వ్యవహారిక భాషలను వాడవలెనని ప్రభోదించేవారు. గురజాడ అప్పారావు గారికీ, వీరికి భాష విషయంలో కొద్దిపాటి అభిప్రాయ భేదాలున్నప్పటికీ గురజాడ వారు వీరి భాషా పాండిత్యాన్ని గౌరవించేవారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయము వారు 1927లో తొలి కళాప్రపూర్ణ బిరుదు నిచ్చి సత్కరించారు. ఆంధ్ర సారస్వత సభవారు "మహోపాధ్యాయ" మరియూ విద్యాదానవ్రత మహోదధి, ద్వారకపీఠ శంకరాచార్యులవారిచే "సర్వతంత్ర స్వతంత్ర" అనే బిరుదములనిచ్చి సత్కరించారు. నన్నెచోడుని కుమార సంభవము విమర్శనా గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వారి సత్కారం 1958లో లభించింది. నాటినుండి నేటి వరకూ వేదం వేంకట రాయ శాస్త్రివలె, ఒంటిచేత్తో అటు సంస్కృత గ్రంథాలకు, ఇటు ఆంధ్ర గ్రంథాలకు వ్యాఖ్యానాలు వెలయించినవారు గానీ, విమర్శనా గ్రంథాలను గానీ రచించినవారు లేరనే చెప్పాలి.

వీరు చరమదశలో అనారోగ్యంతో 1929 జూన్ నెల18వతేదీ పరమ పదించారు. శాస్త్రి రచనా వైశిష్ట్యం భాషాభిమానులకు అర్థంకావాలంటే తాతగారి జీవితచరిత్రను "వేదం వేంకటరాయ శాస్త్రి జీవిత సంగ్రహము" పేరుతో అదే పేరుతో ఉన్న వెంకటరాయ శాస్త్రి మనుమడు రచించిన గ్రంథాన్ని చదివితీరాల్సిందే!

(జూన్, 18.. వేదం వేంకటరాయశాస్త్రి వర్ధంతి)



డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య
ఫోన్: 9490400858

# ప్రకృతి విధ్వంసంతోనే విపత్తులు

## బీజేపీ నాయకుడు మిడతల



మొక్కలు నాటుతున్న మిడతా రమేష్, రాజేశ్వరి, నరేష్ తదితరులు

ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలంటూ నెల్లూరులో ఇటీవల బీజేపీ నాయకులు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి, నరేష్ తదితరులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొంతమంది స్వార్ధపరులు ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్నారని, వారి బారినుంచి ప్రకృతిని కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా, జిల్లాలో కొందరు అక్రమార్కులు అవసరానికి మించి భూగర్భ జలాలు తోడేయడం, అడవుల విధ్వంసానికి పాల్పడడం, తీర ప్రాంతంలో కీలకమైన మడ అడవులను నరికేయడం వంటి దురాగతాలకు పాల్పడుతున్నా రన్నారు. పర్యావరణ రక్షణకు ప్రతిఒక్కరు నడుం బిగించాలని, చెట్లు నాటాలని వారు పిలుపునిచ్చారు. అల్లూరు నాగేంద్రసింగ్, పద్మావతి, ఏవీ సుబ్బయ్య, చంద్ర, శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

## పాండురంగ అన్నదాన సమాజానికి..

# దరఖాస్తులు పంపండి

నెల్లూరు పప్పులవీధిలో ఉన్న శ్రీ పాండురంగ అన్నదాన సమాజం పేద ఆర్యవైశ్య విద్యార్థుల కోసం నిర్వహించే ఉచిత భోజన వసతి గృహం, ఉచిత హాస్టలులో చేరేందుకు దరఖాస్తులు కోరుతున్నారు. 2026-2027 విద్యా సంవత్సరంలో 6వ తరగతి నుండి డిగ్రీ వరకు చదువుకునే విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ సమాజం కార్యదర్శి చలువాది వెంకటేశ్వర్లు (వైభవ్ శ్రీనివాస్), మరియు హాస్టల్ కమిటీ ఛైర్మెన్ వాయుగుండ్ల హజరత్తయ్యలు ఒక ప్రకటనలో కోరారు. జూన్ 6వ తేదీ నుంచి దరఖాస్తు ఫారాలు ఇస్తున్నామని, ఈనెల 28వ తేదీ వరకు దరఖాస్తు ఫారాలను విద్యార్థుల నుంచి స్వీకరిస్తామని, 29వ తేదీన తుది జాబితా ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు.

## నిర్మాణరంగంలో..

# దూసుకుపోతున్న 'వంశీరామ్ బిల్డర్స్'

- ఎకరా 204 కోట్ల లెక్కన.. 1040 కోట్లతో 5.09 ఎకరాలు కొనుగోలు
- 36 అంతస్తుల్లో కమర్షియల్ ప్రాజెక్టు నిర్మాణానికి సన్నాహాలు

*'బాబోయ్ ఎకరా భూమి 204 కోట్లా'.. అంటూ జనం ఆశ్చర్యపోతున్నారు. ఔను!.. నిజమే!.. ఎకరా 204 కోట్ల లెక్కన 5.09 ఎకరాలను 1034 కోట్ల రూపాయలకు వేలంలో కొనుగోలు చేయడమంటే మాటలు కాదు. ఎంతటి అసాధ్యాన్నయినా పట్టుబట్టి సుసాధ్యం చేయగల సత్తా ఉన్న మన నెల్లూరీయుడు.. 'వంశీరామ్ బిల్డర్స్' అధినేత.. బద్వేలు సుబ్బారెడ్డి దానిని అక్షరాలా నిజం చేసి, హైదరాబాద్‌లోనే కాక, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే సంచలనం సృష్టించారు. తద్వారా 'వంశీరామ్ బిల్డర్స్' సత్తా ఏమిటో మరీ చూపించారు.*





బద్వేలు సుబ్బారెడ్డి

ఎప్పుడు ఆకాశానికి ఎదిగిపోతుందో.. ఎప్పుడు పాతాళానికి దిగిపోతుందో తెలియని రంగం ఏదైనా ఉందంటే అది రియల్ ఎస్టేట్ రంగమే. ఎంతో అప్రమత్తంగా ఉండడమే కాక, అత్యంత ప్రతిభాపాటవాలుంటే తప్ప ఆ రంగంలో నిలదొక్కుకోలేం. అలాంటిది ఏళ్ళ తరబడిగా ఆ రంగంలో ఉంటూ, ఎన్ని కష్టనష్టాలెదురైనా నిబ్బరంగా అధిగమిస్తూ..రియల్ ఎస్టేట్ రంగంలో నెల్లూరీయులు తమ సత్తా చాటుకుంటున్నారు. కోట్లాదిరూపాయలను వెచ్చిస్తూ హైదరాబాద్‌లోనూ అద్భుతమైన భవనాలను నిర్మిస్తున్నారు. హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో అనేక భవనాలను అత్యద్భుతంగా నిర్మాణం గావిస్తూ, ఆ రంగంలో అపారమైన ప్రజ్ఞాపాటవాలతో ముందడుగు వేస్తూ.. నెల్లూరు పేరును మార్మోగిస్తున్నారు. ఆ కోవలో ప్రధానంగా నెల్లూరుజిల్లా విడవలూరు మండలం పార్లపల్లి గ్రామానికి చెందిన బద్వేలు సుబ్బారెడ్డి సాటిలేని మేటిగా పేరొందారు. హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో కళ్ళు చెదిరే భవనాల నిర్మాణాలకు ఆయన పెట్టింది పేరు. తనకెంతో ఇష్టమైన తన మేనల్లుడి 'వంశీరామ్'.. పేరుతోనే ఆయన 'వంశీరామ్ బిల్డర్స్'ని స్థాపించారు. ఆ సంస్థ ఇప్పుడు ఒక్క హైదరాబాద్ నగరంలోనే కాదు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎదురులేని సంస్థగా దూసుకుపోతోంది.

ఇటీవల హైదరాబాద్‌లోని రాయదుర్గం భూములకు జరిగిన ఈ-వేలంలో ఎకరా 240 కోట్ల రూపాయలు పలికినా, ఏ మాత్రం వెనుకంజ వేయకుండా సుబ్బారెడ్డి ఆ భూములను కొనుగోలు చేయడం విశేషం! రాయదుర్గంలో ఐటీసీ కోహినూర్‌కు సమీపంలో ఉన్న 5.09 ఎకరాల ప్లాట్‌కు తెలంగాణ మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) ఇటీవల ఇ-వేలం నిర్వహించగా, మొత్తంగా సుమారు 1040 కోట్ల రూపాయలు వెచ్చించి వంశీరామ్ బిల్డర్స్ సంస్థ ఆ స్థలాలను సొంతం చేసుకోవడం రియల్ ఎస్టేట్ రంగంలోనే పెద్ద కలకలం సృష్టించింది. ఈ ప్లాట్‌లో ఏకంగా 35 అంతస్తుల్లో కమర్షియల్ ప్రాజెక్టు నిర్మించడం జరుగుతుందని వంశీరామ్ బిల్లడర్స్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) బద్వేలు సుబ్బారెడ్డి తన ఆకాంక్షను వెల్లడించారు. అయిదేళ్ళలో ఈ ప్రాజెక్టును పూర్తిచేసేందుకు కృషిచేస్తామని కూడా ఆయన తెలిపారు. రాయదుర్గం కారిడార్‌పై తాము దృష్టి సారించామని, లెమన్ ట్రీ సమీపంలో 15 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ పార్కు నిర్మాణంలో ఉందని వివరించారు. ఇదే ప్రాంతంలో మరో 6 ఎకరాల్లో కూడా ఐటీ పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

### యువకప్రాయం నుంచే అమోఘ ప్రతిభ :

బద్వేలు సుబ్బారెడ్డి 19ఏళ్ళ వయసులోనే నిర్మాణరంగంపై మక్కువ చూపించారు. తమ బాబాయి చేయూతతో ఆ రంగంలోకి ప్రవేశించారు. తాను కూడా మంచి వ్యాపారవేత్తగా రాణించాలనే ఆశయంతో అడుగులు వేశారు. అన్నిరకాల ఒడిదుడుకులను నిబ్బరంగా ఎదుర్కొంటూ తొలినుంచీ ఆయన నిర్మాణ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సాధించుకున్నారు. కష్టేఫలీ అన్నట్లుగా ఆయన కష్టం ఫలించింది. అహరహం ఆయన పడిన శ్రమకి అనతికాలంలోనే మంచి గుర్తింపు ప్రతిఫలంగా లభించింది. అన్ని రకాల ఆధునిక వసతులతో కూడిన భవన నిర్మాణాల్లో మేటిగా.. ఘనాపాటిగా ఆయన ప్రసిద్ధి చెందారు. తమ మేనల్లుడు వంశీరామ్ పేరుతో 1998లో ఆయన స్థాపించిన 'వంశీరామ్ బిల్డర్స్' ద్వారా, 2000వ సంవత్సరంలోనే శ్రీనగర్‌కాలనీలో అపార్ట్‌మెంట్‌లు కట్టడం ప్రారంభించడం, ఆ తర్వాత 2010వ సంవత్సరంలోగా 40కి పైగా భవన నిర్మాణాలను పూర్తిచేయడం ఆయన పట్టుదలకి.. అద్వితీయ మేధాశక్తికి నిదర్శనం. రియల్ ఎస్టేట్ రంగంలో 'రియల్ హీరో' అనిపించుకుంటూ నెల్లూరీయుల పేరుప్రతిష్టలను దశదిశలా చాటుతున్న బద్వేలు సుబ్బారెడ్డికి.. వారి సంస్థ.. వంశీరామ్ బిల్డర్స్‌కి.. 'లాయర్' శుభాభినందనలు!

## మత్స్యకారుల సమస్యలపై...

# స్పందించిన వీపీఆర్



వేమిరెడ్డిని సత్కరిస్తున్న పెద్దపట్టపుపాళెం మత్స్యకార సంఘు పెద్ద కాపులు

కందుకూరు నియోజకవర్గం, ఉలవపాడు మండలం, చాకిచెర్ల పరిధిలోని పెద్దపట్టపుపాళెం గ్రామానికి చెందిన మత్స్యకార సంఘ నూతన పెద్ద కాపులు ఇటీవల నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పెద్దపట్టపుపాళెం గ్రామ మత్స్యకారులు తమ జీవనోపాధి కోసం నిత్యం గ్రామ సమీపంలోని సముద్రంలోకి వెళ్లాల్సి ఉంటుందని, అయితే, మార్గమధ్యంలో ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జి తీవ్రంగా దెబ్బతిందని పెద్ద కాపులు ఎంపీకి వివరించారు. అందుకు స్పందించిన ఎంపీ, మత్స్యకారుల ప్రయోజనాల దృష్ట్యా తన సొంత నిధులతో ఆ బ్రిడ్జికి మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఎంపీ ల్యాడ్స్ నిధుల ద్వారా గ్రామంలోని ప్రధాన వీధికి సీసీ రోడ్డును మంజూరు చేస్తానని కూడా వారికి హామీ ఇచ్చారు.

## నార్త్ రాజుపాలెంలో..

# 17న మెగా జాబ్ మేళా

### 15 కంపెనీల్లో 2100 ఉద్యోగ అవకాశాలు - ప్రశాంతిరెడ్డి



నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల జూన్ 17వ తేదీన కోవూరు నియోజకవర్గంలో భారీ మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈనెల 10న ఓ ప్రకటనలో తెలిపారు. నార్త్‌రాజుపాలెంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీలో ఉదయం 9 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 15 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, వీటి ద్వారా దాదాపు 2100 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు. 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, డిప్లొమా, బీ.టెక్, బీ.ఫార్మసీ, పీజీ చదివిన అభ్యర్థులందరికీ వారి అర్హతలకు తగిన ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయన్నారు. 18 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల విద్యార్హతలు, అనుభవాన్ని బట్టి నెలకు కనీసం రూ.12,000 నుంచి గరిష్ఠంగా రూ.25,000 వరకు జీతం ఉంటుందని, కొన్ని కంపెనీలలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారని తెలిపారు. నియామకమైన వారు కంపెనీల అవసరాలను బట్టి నెల్లూరు, నాయుడుపేట, ముత్తుకూరు సెజ్, శ్రీసిటీ సెజ్‌తో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో పని చేయాల్సి ఉంటుందని కూడా ఆమె వివరించారు.

# జొన్నవాడలో యోగా శిక్షణ



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో 14 రోజుల యోగా శిక్షణ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. యోగ సాధన వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను యోగా నిపుణులు వివరించారు. ఈ యోగా శిక్షణ జూన్ 20 వరకు ప్రతిరోజు ఉదయం 7 గంటలకు నిర్వహించబడుతుందని, ఆసక్తి గల భక్తులు, యువత, మహిళలు మరియు సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని యోగ సాధన ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఇఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి కోరారు.

## కలెక్టరేట్‌కి...

# కొత్త ఏఓ



నెల్లూరు కలెక్టరేట్ కొత్త పరిపాలనాధికారి (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా విడవలూరు తహశీల్దార్‌గా పని చేస్తున్న చంద్రశేఖర్ నియమితులయ్యారు. బుధవారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ స్థానంలో ఉన్న విజయకుమార్ ఉద్యోగ విరమణ చేయడంతో, ఇప్పటి వరకు కలెక్టరేట్‌లోని భూ సంస్కరణల విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాసులు ఇన్‌చార్జిగా ఉండేవారు. ఆ స్థానాన్ని ఇప్పుడు చంద్రశేఖర్‌తో భర్తీ చేశారు.

## గ్రంథాలయాలను..

# ప్రజలకు చేరువ చేయాలి




అవార్డును బహుకరిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ శాంతికుమారి, పక్కన కార్యదర్శి కుమార్‌రాజా

గ్రంథాలయాలను ప్రజలకు చేరువ చేయాలని జిల్లా గ్రంథాలయసంస్థ ఛైర్‌పర్సన్ మేకపాటి శాంతి కుమారి చెప్పారు. ఈనెల 9న నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా, వేసవి విజ్ఞాన శిబిరాలను విజయవంతం చేసినందుకు గ్రంథాలయ ఉద్యోగులను ఆమె అభినందించారు. గ్రంథాలయాల అభివృద్ధిలో ఉద్యోగులది కీలకపాత్ర అన్నారు. అనంతరం, ఉత్తమ గ్రంథపాలకులుగా అవార్డు పొందిన జె.సురేంద్రరెడ్డి, డి.నారాయణరావు, ఓ.శ్రీనివాసరాజు, కె.మంజులత, ఎం.విజయలక్ష్మిలకు ఆమె అవార్డులను అందజేశారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమారరాజా మాట్లాడుతూ, గ్రంథాలయాల సిబ్బంది సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెస్కో వారు విరాళంగా ఇచ్చిన పుస్తకాలను జిల్లాలోని అన్ని గ్రంథాలయాలకి పంపించారు.

# నటనకి జీవం పోసిన.. 'మట్టి మనిషి'




"కావ్యేషు నాటకం రమ్యం" అన్నారు ఆలంకారికులు. అంటే అన్ని సాహిత్య ప్రక్రియలలో 'నాటకం' రమ్యమైనదని అర్థం. నిజమే! జనాన్ని ఆలోచింపజేసేది, ఆనందపరిచేది చైతన్య పరిచేది నాటకమే!

అలాంటి నాటకమే 'మట్టి మనిషి'. 1970 ప్రాంతాల్లో నవలగా ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో రెండేళ్ల సీరియల్‌గా ప్రచురించబడింది. 1972లో మొదటి ముద్రణ జరిగింది. నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా వారు 14 భారతీయ భాషల్లోకి అనువదించి ప్రచురింపజేశారు. ప్రముఖ రచయిత్రి డా. వాసిరెడ్డి సీతాదేవి రాశారు. ప్రసిద్ధ కథకులు వల్లూరు శివప్రసాద్ దీన్ని నాటకంగా మలిచారు. 50 మంది సాంకేతిక బృందం, కళాకారులు సమిష్టి సేద్యం 'మట్టి మనిషి' నాటకం. ఈ నెల 7వ తేదీ ఆదివారం సాయంత్రం నెల్లూరు, శ్రీ వేంకటేశ్వర కస్తూరిబా కళాక్షేత్రంలో 5.30 గంటలకు ప్రదర్శన ప్రారంభించి, మూడున్నర గంటల పాటు కొనసాగించారు. ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. ప్రఖ్యాత నటుడు ఎస్.ఎం.భాషా దర్శకత్వం వహించారు. నాటకంలోని పాటలను ప్రసిద్ధ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, అనంత్ రచించారు. వై.గంగాధర్ సంగీతం సమకూర్చారు.

ఒకప్పుడు భూమి ఉత్పత్తి స్థానం. ఇప్పుడు అది ఒక వ్యాపార వస్తువు. ఒకప్పుడు భూమిని నమ్ముకుని బతికేవారు. ఇప్పుడు భూమిని అమ్ముకుని బతుకుతున్నారు. కోట్లకు పడగలెత్తుతున్నారు. ఎంత కాలం ఈ పరిస్థితి కొనసాగుతుందో చెప్పలేం. దానికితోడు స్వాతంత్ర్యం వచ్చాక వ్యవసాయం అంటరానిదైపోయింది. రైతు దిక్కులేని వాడైపోయాడు. ఇందులో 'సాంబయ్య' అనే రైతు ప్రధాన పాత్రధారుడు. వలసవచ్చి, కష్టించి, కొంత భూమిని కొడుకు సాంబయ్యకిచ్చి పోతాడు వెంకయ్య అనే అతని తండ్రి. సాంబయ్య దాన్ని తన కాయకష్టంతో 80 ఎకరాలు చేస్తాడు. ఒక్కగానొక్క కొడుకు వెంకటపతికి పెళ్లి చేస్తాడు సాంబయ్య. వచ్చిన కోడలు నేల విడిచి సాము చేస్తుంది. రామనాథం బాబు అనే మోసగాడి వలలో చిక్కి, సినిమా హాల్ నిర్మాణంలో సాంబయ్య సంపాదించిందంతా హారతి కర్పూరం చేస్తుంది. మామ సాంబయ్య మాటను పెడచెవిన పెడుతుంది. కోడలు వరూధిని, కొడుకు వెంకటపతి చనిపోయాక, సాంబయ్య తన మనవడితో కలిసి, మళ్ళీ కౌలు జీవితం ప్రారంభిస్తారు. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో – కనకయ్య అనే బతకనేర్చినవాడి పాత్ర నాటకానికి హైలైట్. అమాయక రైతుల్ని తెలివిగా మోసగించి పబ్బం గడుపుకునే పాత్ర. ఈ పాత్రను దర్శకుడే ధరించి నటనలో తారాస్థాయికి వెళ్లాడు. వరూధిని పాత్రధారిణి అన్ని రకాల భావావేశాలను ప్రదర్శించి ప్రేక్షకులను తన నటనా కౌశలంతో ఆకట్టుకుంది. ఇక ప్రధానపాత్రధారి సాంబయ్య తన సహజ నటనతో ఉత్తమోత్తమ నటన ప్రదర్శించి, ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేశాడు.

"నాకు చదువురాదని, బడికి వెళ్లలేదని, ఎవరు చెప్పారురా? నేలే నా పలక... నాగలే నా బలపం... పొలమే నా బడి, భూమ్మీదే దిద్దాను అన్నీ... ఈ భూమి నేర్పింది.. నా తల్లి, దైవం, గురువు ఈ భూమేరా! చెప్పరా మనవడా! నీ చదువెక్కువో, నా చదువెక్కువో" లాంటి పదునైన మాటలు నాటకం అయిపోయాక కూడా ప్రక్షకుల చెవుల్లో గింగురుమంటాయి.

**సమీక్ష: డా. గంగిశెట్టి శివకుమార్**
**ఫోన్: 94418 95343**

## రూరల్ ప్రజలకు
# మెరుగైన విద్యుత్ సేవలు
### ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందిస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల స్థానిక విద్యుత్ భవన్‌లో సబ్ డివిజినల్ భవనాన్ని రిటైర్డ్ లైన్‌మెన్ పద్మనాభయ్య చేతులమీదుగా ప్రారంభింపచేసిన సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్.ఈ. రాఘవేంద్రం, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డితో పాటు ఆయన పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు సంవత్సరాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశీస్సులతో మెరుగైన విద్యుత్ సేవలు ప్రజలకు అందించేందుకు నెల్లూరు రూరల్‌లో అనేక కార్యక్రమాలు చేపట్టి పూర్తిచేశామని ఎమ్మెల్యే కోటంరెడ్డి తెలిపారు. అదనంగా సబ్ స్టేషన్‌ల నిర్మాణాలకు కూడా అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నామని, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహాయ సహకారాలతో నెల్లూరు రూరల్‌లో నాణ్యమైన విద్యుత్‌షేవలను ప్రజలకు అందిస్తున్నామని, నెల్లూరు రూరల్ అభ్యున్నతి ధ్యేయంగా స్థానిక శాసనసభ్యుడిగా నిరంతరం తాను పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ భీమినేని మురహరి, బీజేపీ నాయకులు విజయ్‌కుమార్, జనసేన నాయకులు సుందరరామిరెడ్డి, ఉదయ్, టీడీపీ నాయకులు ఉప్పు భాస్కర్, రమణయ్య నాయుడు, అలహరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమికి రెండేళ్ళు.. క్యాడర్‌కి కన్నీళ్ళు!

(మొదటిపేజీ తరువాయి)

ఇదే సమయంలో ఏళ్లకేళ్లు పార్టీకి కష్టపడిన సీనియర్లు రాజ్యసభ స్థానాల కేటాయింపులో జరిగిన అన్యాయాన్ని గుర్తు చేసుకుంటూ కక్కలేక మింగలేక మౌనం పాటిస్తున్నారు.

## పాలనలో అలా, పార్టీలో ఇలా..!

గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల్లో రాష్ట్రం అధోగతి పాలైన విషయం తెలిసిందే. వ్యక్తిగత కక్షలు, అరెస్టులు, అవినీతి, కుంభకోణాలు, దాడులు విధ్వంసాలతో కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులు విలయతాండవం చేయగా, మరికొందరు నోటికి ఎంతమాటొస్తే అంత మాట అనేస్తూ తిట్లదండకంతో అటు పార్టీని, ఇటు అభివృద్ధిని అటకెక్కించారు. ఫలితంగా ప్రజలు ఈ పార్టీ మాకొద్దు బాబోయ్ అంటూ జగన్ పార్టీ నేతలను 11 సీట్లకు పరిమితం చేసి ఇంటికి పంపించారు. ఇక వేరేదిక్కులేక రాష్ట్రంలో ఏకైక ప్రత్యామ్నాంగా ఉన్న కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలను నెత్తికెక్కించుకున్నారు. అయితే... ఇదంతా మా చలవే, మా చరిష్మానే అన్నట్లు కొందరు కూటమి నేతలు ఫీలైపోతున్నారు. మరికొందరు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలతో పాలనను కొంత మేర నియోజకవర్గ స్థాయిలో పట్టాలెక్కిస్తున్నారు. ఇక సీఎంగా చంద్రబాబు అమరావతిలో ఎలాగైనా రాజధానిని నిర్మించేందుకు శక్తివంచన లేకుండా కష్టపడుతున్నారు. అయితే, ఈ క్రమంలో అధినేత తమను పట్టించుకోవడం లేదనే కార్యకర్తల ఆవేదన మాత్రం టీడీపీలో అంతకంతకూ పెరిగిపోతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. జనసేన, బీజేపీలో కంటే కూటమిలో అతిపెద్ద పార్టీ అయిన టీడీపీలోనే ఈ అసంతృప్తి అధికంగా కనిపిస్తోంది. పేరుకు పెద్దపార్టీకి చెందిన కార్యకర్తలమే అయినా, ఏళ్లకేళ్లు పార్టీకోసం కష్టపడినా, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు లభిస్తున్న కనీస గౌరవం కూడా తమకు దక్కడం లేదంటూ చాలా మంది లోలోన అంతర్మథనం చెందుతున్నారు. బూత్ లెవల్లో కేసులు ఎదుర్కొని ఘర్షణలు పడి తలలు పగులగొట్టుకునే స్థాయిలో ప్రత్యర్థులకు ఎదురునిలిచినందుకు మాకు దక్కే గౌరవం ఇదేనా..? మాకు చేకూరే మేలు ఇంతేనా..? అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల స్థాయిలో ఎంతో కొంత గుర్తింపు , పనులు జరుగుతున్నా, క్షేత్రస్థాయి కార్యకర్తలకు మాత్రం మొండిచేయే మిగులుతోందని వాపోతున్నారు. ప్రజల బాగుకోసం నిరంతరం శ్రమిస్తున్న తమ అధినేత పార్టీ కోసం కష్టపడే కార్యకర్తల త్యాగాలను గుర్తించి ప్రోత్సహించేదెప్పుడు అంటూ ప్రశ్నిస్తున్నారు. మా పార్టీ వస్తే బాగుంటాం, మా పార్టీ వస్తే బాగుపడుతాం అని ఆశించిన వారి ఆశలు నెరవేరేదెప్పుడో అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## డబుల్ ధమాకాలోనూ అన్యాయమేనా?

కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ నేతృత్వంలో డబుల్ ధమాక పేరిట భారీ సభను తిరుపతిలో ఏర్పాటు చేయాలని కూటమి పెద్దలు నిర్ణయించారు. ఈ సభ ఏర్పాట్లు, నిర్వహణ బాధ్యతంతా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలే చూసుకుంటున్నారు. వాటికి కావాల్సిన సరంజామా, జనసమీకరణ బాధ్యత కూడా వారిదే. కానీ, సదరు సభలో వారికి గుర్తింపు కానీ, గౌరవం కానీ పెద్దగా దక్కదు. కూటమిలోని ఇతర పార్టీల కార్యకర్తల్లాగే వారు వ్యవహరించాల్సి ఉంటుంది. ప్రభుత్వంపై విమర్శలు వస్తే అవి నేరుగా తగిలేది టీపీడీ కార్యకర్తలకే. క్షేత్రస్థాయిలో బదులు చెప్పాల్సింది కూడా తెలుగుదేశం నాయకులే. కానీ ప్రభుత్వానికి మంచిపేరు వస్తే ఆ క్రెడిట్ అంతా తమదే అన్నట్లుగా పార్టీ అధినేతలు కాలర్ ఎగరేస్తారు. ఫలితంగా టీడీపీ కేడర్‌లో నానాటికీ అసంతృప్తి, ఆవేదన కొండలా పేరుకుపోతోంది. దీంతో తనను గుర్తించేవారే కరువయ్యారంటూ వారంతా లోలోన మదనపడుతుండడం రాష్ట్రవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తోంది.

## అధినేత ఆలకించేదెప్పుడో..?

తెలుగుదేశం పార్టీకి భవిష్యత్ లేదు, తెలుగుదేశం పార్టీ ఇక కనుమరుగే, రానున్న 30 ఏళ్లు మా నాయకుడే ఏకఛత్రాదిపత్యంగా రాష్ట్రాన్ని ఏలుతారంటూ గతంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తరచూ చెప్పేవారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కూడా వైనాట్ 175 పేరుతో టీడీపీ ఇక తుడుచుపెట్టుకుపోయినట్లే అని తన ప్రసంగాల్లో పేట్రేగిపోయారు. అయితే, గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ అధిపత్యాన్ని ఎదిరించి వారి ఆగడాలను భరించి పార్టీకోసం టీడీపీ కార్యకర్తలు గత ఎన్నికల్లో భగీరథ పోరాటమే చేశారంటే అతిశయోక్తి కాదేమో. వారి కష్టం, త్యాగాల ఫలితంగానే తెలుగుదేశం మళ్లీ అధికారంలోకి రాగలిగిందనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటిది పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా వారిని గుర్తించి, వారి కష్టాన్ని గమనించి వారికి అండగా మేమున్నాం అంటూ వారి పక్కన నిలబడే నాయకుడే కనిపించడం లేదు. ఈ పరిస్థితి మారాలంటే గ్రామస్థాయిలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కార్యకర్తలు, కేసుల్లో ఇరుక్కుని అల్లాడుతున్న నాయకులు, పార్టీ కోసం అన్నీ వెచ్చించి దివాలా తీసిన నేతలను దగ్గరకు తీసుకుని వారిని వెన్నుతట్టి ప్రోత్సహించాల్సిన బాధ్యత చంద్రబాబు, లోకేష్‌పైనే ఉందంటే అతిశయోక్తి కాదేమో. ఇందుకోసం పార్టీ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి వినతులు స్వీకరించి అర్హులైన వారికి అండా దండా అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు సార్థకత చేకూరుతుందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

## సీనియర్లలో రాజ్యసభ చిచ్చు!

సరిగ్గా ఇదే సమయంలో మూడు స్థానాలకు తెలుగుదేశం పార్టీ నుంచి పారిశ్రామికవేత్తలను రాజ్యసభకు ఎంపిక చేయడం కూడా చర్చనీయాంశంగా మారింది. పార్టీలో ఎప్పటి నుంచో పనిచేస్తూ, కష్టకాలంలో అండగా నిలిచిన యనమల రామకృష్ణుడు, కంభంపాటి, వర్ల రామయ్య, గల్లా జయదేవ్ వంటి నేతలంతా పెద్దల సభలో స్థానం కోసం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే, పార్టీకి ఆర్థిక జవసత్వాలు అందించారనే కారణంగా చంద్రబాబు పారిశ్రామికవేత్తలనే రాజ్యసభ కోటాలో ఎంపీలను చేశారు అన్నది బహిరంగ రహస్యం. దీంతో దశాబ్దాలుగా పార్టీ కోసం తాము చేసిన త్యాగాలు ప్రస్తుతం అక్కరకు రాకుండా పోయాయని, తాము పేరుకు మాత్రమే పార్టీలో ఉన్నామంటూ కొందరు సీనియర్లు తమ అనుచరుల వద్ద వాపోతున్నట్లు సమాచారం. ఏదేమైనా తెలుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినా పార్టీ కార్యకర్తల్లో మాత్రం ఆవేదన ఇసుమంతైనా తగ్గకపోవడం మాత్రం దురదృష్టకరమే. ఇక వైఎస్సార్‌సీపీ విషయానికి వస్తే ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ తమ ఉనికి చాటుకునేందుకు కోసం వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించడం గమనార్హం. తాను అర్థంలేని పోరాటం పదవికోసం ఆరాటపడుతున్న క్రమంలో సబ్బుగా ఉన్న పార్టీ కేడర్‌ను మరోసారి నిరసనల్లో దించి వారిని కూడా తనలాగే కేసులు, కోర్టులు చుట్టూ తిప్పే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా పార్టీకి సంబంధంలేని పారిశ్రామిక వేత్తనే రాజ్యసభ ఎంపీని చేయడం గమనార్హం. ఏదేమైనా పార్టీలు అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా కష్టపడేది కార్యకర్తలే, సుఖపడేది ఆర్థిక స్తోమత ఉన్న ఆజానుబాహులే అన్న నగ్న సత్యం మరోసారి రాష్ట్రరాజకీయాల్లో తేటతెల్లం కావడం విశేషం. కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా, సగటు నాయకులకి, కార్యకర్తలకి మాత్రం కన్నీళ్లు మిగిలాయన్నది ప్రస్తుతం ఆయా పార్టీల క్యాడర్ నోటి నుండి వినపడుతున్న మాట..!



కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' వార్తాపత్రిక

లాయర్ 45 YEARS

నాలుగున్నర దశాబ్దాల సాహసయాత్ర
పత్రికారంగంలోనే **లాయర్**ది విశిష్ట పాత్ర

లాయర్
వార్తాపత్రికకి
45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.



బద్వేలు సుబ్బారెడ్డి
చైర్మెన్ & మేనేజింగ్ డైరెక్టర్

VAMSIRAM™
SINCE 1999
8th Floor, Vamsiram Jyothi Lorven, Road No. 45 Jubilee Hills,
Nandagiri Hills, Jubilee Hills, Hyderabad, Telangana-500033.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com